
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

మంగళవారం 28 అక్టోబరు 2025

అరణియార్ @28.8 అడుగులు



స్పిల్‌వే గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

పిచ్చాటూరులోని అరణియార్ రిజర్వాయర్ సోమవారం సాయంత్రానికి 28.8 అడుగులకు (1.525 టీఎంసీలు) చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 32 అడుగులు(1.853 టీఎంసీలు) కాగా, 31 అడుగులు నిల్వ ఉంచుతారు. ప్రస్తుతం అరుణానది, యాలం కాలువల ద్వారా రిజర్వాయరులోకి 400 క్యూసెక్కుల నీళ్లు వస్తుండగా, అంతే మొత్తంలో రెండు స్పిల్‌వే గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు.

\- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి

మల్లిమడుగుకు పెరిగిన ప్రవాహం



రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యామ్‌కు సోమవారం తెల్లవారుజాము నుంచి నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఆరు గేట్లను ఒక అడుగుపైకి లేపి నీటిని కిందకు విడుదల చేశారు. ప్రస్తుతానికి 700 క్యూసెక్కుల నీరు డ్యామ్‌లోకి వస్తుండగా 800 క్యూసెక్కులను కిందకు విడుదల చేశారు.

\- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

వర్షంలోనూ 'కార్తీక' వెలుగులు



కపిలతీర్థం పక్కన ఉద్యానవనంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



తిరుపతి నగరం కపిలేశ్వరస్వామి ఆలయంలో కార్తీక తొలి సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఈసారి ఆలయం లోపల కార్తీక దీపాలను వెలిగించడానికి అధికారులు అనుమతించలేదు. ఆంజనేయ స్వామి సన్నిధి సమీపంలోని ఉద్యానవనంలో అనుమతివ్వడంతో అక్కడే దీపాలు వెలిగించారు. పిండి, నిమ్మకాయలు, ఉసిరి కాయల్లో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షం కురుస్తున్నా.. తడుస్తూనే కొందరు, గొడుగుల కింద మరికొందరు దీపాలు వెలిగించారు. జలపాతం ఉధృతి కారణంగా కపిలతీర్థంలోకి అనుమతించకుండా ఫెన్సింగ్ వేశారు.

\- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

ఆరెంజ్ అలర్ట్



కోట మండలం శ్రీనివాససత్రం వద్ద పరవళ్లు తొక్కుతూ ముందుకు వచ్చి ఉన్న సముద్రం

- నేడు భారీ వర్ష సూచన
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవు
- బీచ్‌లు, జలపాతాలకు రాకపోకల నిషేధం

సోమవారం: 'మొంథా' ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మబ్బులు కమ్ముకుని చలిగాలులతో పాటు అడపాదడపా జల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో సముద్రతీరం వద్ద అలలు ఎగిసిపడుతున్నాయి.

మంగళవారం: భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. దీటుగా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది.

తీర ప్రాంతంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

జిల్లాకు రెండు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వచ్చాయి. కోట, వాకాడు, చిల్లకూరు వంటి సముద్ర తీర ప్రాంత మండలాలలో సహాయక చర్యల కోసం ఒక బృందాన్ని గూడూరులోను.. మరో బృందాన్ని సూళ్ళూరుపేటలో వుంచారు. పులికాట్ సరస్సు పరంగా ఇబ్బందులు తలెత్తితే తడ, సూళ్ళూరుపేట మండలాలకు, స్వర్ణముఖి, కాళంగి నదుల పరంగా ఇబ్బందులు ఎదురైతే నాయుడుపేట, శ్రీకాళహస్తి తదితర మండలాలకు త్వరగా చేరుకునేలా అక్కడ ఉంచారు.

తిరుపతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. మంగళవారం జిల్లాకు భారీ వర్ష సూచన చేసింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. సెలవులు పెట్టిన ఉద్యోగులు, అధికారులు జిల్లాలో అందుబాటులో ఉంటే.. సెలవులను రద్దు చేసుకుని విధుల్లో చేరాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచీ ఆయన రెవెన్యూ, పోలీసు, ఫైర్, వైద్యారోగ్య, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, వ్యవసాయ వంటి కీలక శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. సంబంధిత శాఖల క్షేత్రస్థాయి ఉద్యోగులు 24 గంటలూ కార్యక్షేత్రంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్ పనులు ఆపేసి.. అక్కడ వినియోగించే ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు సిబ్బందితో పాటు జిల్లా యంత్రాంగానికి అందుబాటులో ఉంచాలన్నారు. ఇక, కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లోని సముద్ర తీర ప్రాంతంలో బీచ్‌ల వద్దకు పర్యాటకుల రాకపోకలను బుధవారం వరకూ నిషేధించారు. ఈ మూడు చోట్ల సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతుండడంతో ముందుజాగ్రత్తగా పర్యాటకులను అనుమతించడం లేదు. జిల్లాలోని అన్ని జలపాతాల వద్దకూ బుధవారం వరకు రావొద్దంటూ పర్యాటకులకు అధికారులు సూచించారు. ఇప్పటికే సోమవారం నుంచీ బుధవారం వరకూ మూడు రోజుల పాటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిన సంగతి తెలిసిందే.





తిరుచానూరు వద్ద స్వర్ణముఖి నదికి వెళ్లేదారిని బారికేడ్లతో మూసేశారిలా.. - తిరుపతిలోని కపిలతీర్థంలో పుష్కరిణిలోకి కార్తీక దీపాలు వెలిగించేందుకు భక్తులను అనుమతించకుండా అడ్డుగా వేసిన ఫెన్సింగ్

తుపాను హెచ్చరికల తీవ్రత దృష్ట్యా కలెక్టరేట్, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు ఆర్డీవో కార్యాలయాలతో పాటు అన్ని మున్సిపల్.. తహసిల్దారు కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఇవి 24 గంటలూ పనిచేయనున్నాయి. సమస్యలపై ప్రజలు కంట్రోల్ రూమ్‌లకు సమాచారం ఇస్తే.. పరిస్థితికి అనుగుణంగా వారు స్పందిస్తారు. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి నేరుగా ఫిర్యాదులు, సాయం కోసం అభ్యర్థనలు చేయడానికి, అత్యవసర సమాచారం ఇవ్వడానికి టోల్ ఫ్రీ నెంబర్ కూడా ప్రకటించారు.

తీర ప్రాంతంలో ప్రత్యేకాధికారి పర్యటన



నాయుడుపేటలో ఆర్డీవో, తహసీల్దారులకు సూచనలు ఇస్తున్న ప్రత్యేకాధికారి అరుణబాబు

తుఫాను సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారి అరుణ్‌బాబు సోమవారం జిల్లాకు చేరుకున్నారు. సమీక్షా సమావేశాలకు పరిమితం కాకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించారు. అందులో భాగంగా వాకాడు, చిల్లకూరు మండలాల్లో పర్యటించి ఆయా మండలాల తహసిల్దారు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో కిరణ్మయి, ఇతర అధికారులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మొత్తానికీ మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది.

కడలి కల్లోలం



దొరువుకట్ట వద్ద కోతకు గురైన స్వర్ణముఖి పొర్లుకట్టను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

కోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం గ్రామాల సమీపంలోని సముద్రం సోమవారం కల్లోలభరితంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. 30నుంచి 40 మీటర్లలోతు సముద్రం అలల ఉద్రిక్తతో ముందుకు వచ్చిందని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. వాకాడు మండలం తూపిలిపాళెంలో రాకాశి అలలు 5 మీటర్ల మేర ఎగిసిపడుతున్నాయి. కోట తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎస్ఐ పవన్‌కుమార్ ఆయా గ్రామాలకు వెళ్లి మత్స్యకారులకు ధైర్యం చెప్పారు. ఇక, స్వర్ణముఖి పొర్లుకట్టలు బలహీనంగా ఉన్న వుచ్చలపల్లి, అల్లంపాడు, దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాల్లో రెడ్అలెర్ట్ ప్రకటించారు. అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మైక్‌ల ద్వారా ప్రచారం చేసి అప్రమత్తం చేశారు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి గూడలిలోని స్వర్ణముఖి నది ప్రవాహ తీరును.. దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాల్లో పొర్లుకట్టలను పరిశీలించారు. ఇక, తీరంలో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పర్యాటకులను సముద్రంవద్దకు రాకుండా పోలీసులు, మెరైన్ పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. మరోవైపు ఆక్వా గుంతలలో తక్కువ కౌంట్‌తోనే రొయ్యలను పట్టి రైతులు సొమ్ము చేసుకుంటున్నారు.

'గంగ'లో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

- కారు డ్రైవరు కోసం గాలింపు

వరదయ్యపాళెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు గంగ కాలువలో గల్లంతైన ఇద్దరిలో బాలుడి మృతదేహం సోమవారం దొరికింది. కారుడ్రైవరు ఆచూకీ లభ్యం కాలేదు. వరదయ్యపాళెం మండలానికి చెందిన ఇరిగేషన్ శాఖ ఏఈ బాబు తన కారు కడిగేందుకు డ్రైవర్ షరీఫ్ అలియాస్ చిట్టి (40), తన మనవడు మహిత్(6)తో కలిసి ఆదివారం సాయంత్రం ఉబ్బలమడుగు సమీపంలోని తెలుగుగంగ కాలువ ర్యాంపులో వాహనాన్ని దించారు. ఆ సందర్భంగా డ్రైవర్ షరీఫ్, బాలుడు మహిత్ నీటి ప్రవాహంలో కొట్టుకు పోయిన సంగతి తెలిసిందే. వీరికోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆదివారం నుంచి గాలింపుచర్యలు చేటపట్టారు. మరోవైపు గజ ఈతగాళ్లు, రెస్క్యూ టీం బోటుసాయంతో కాలువలో తీవ్రంగా గాలించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉబ్బలమడుగు చెక్‌పోస్ట్ సమీపంలో 121 కి.మీ. వద్ద బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. షరీఫ్ కోసం రెస్క్యూ టీం గాలింపు చర్యలు చేపడుతోంది. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహ మూర్తి, రూరల్ సీఐ తిమ్మయ్య, బుచ్చినాయుడు కండ్రిగ తహసీల్దార్ శ్రీదేవి, ఎస్ఐ హరిప్రసాద్ సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తుఫాన్‌పై ఆందోళన వద్దు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పై ఆందోళన వద్దని, ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం చెప్పారు. రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే వదంతులు నమ్మొద్దన్నారు. భద్రత, మనుగడకు అవసరమైన వస్తువులను సిద్ధం చేసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని వారు పునరావాస కేంద్రాలకు వెళ్లాలన్నారు. ఎలక్ట్రికల్, గ్యాస్ వంటి వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాల వద్ద ఉండొద్దని సూచించారు. ఈ మూడు రోజులు మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదన్నారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

కలెక్టరేట్ కార్యాలయం: 0877-2236007

తిరుపతి ఆర్డీవో కార్యాలయం: 70321 57040

శ్రీకాళహస్తి: 85550 03504

గూడూరు: 08624-252807, 85000 08279

సూళ్లూరుపేట: 086232 95345, టోల్ ఫ్రీ నెంబరు 18004250101

అత్యవసరమైతేనే బయటకు రండి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం అన్నారు. ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 'అత్యవసరమైతే తప్ప వర్షంలో బయటకు వెళ్లొద్దు. అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దు. నీళ్లున్న ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల వద్దకు పిల్లలు వెళ్లకుండా చూసుకోండి. ఉధృత ప్రవాహాల నేపథ్యంలో ఈత, స్నానం కోసం దిగొద్దు. శిథిల ఇళ్లల్లోని వారు అధికారులు చెప్పిన వెంటనే పునరావాస కేంద్రాలు లేదా బంధువుల ఇళ్లకు వెళ్లండి. ఏదైనా ప్రమాదం గమనించినా, విద్యుత్ వైర్లు తెగిపడినా, చెట్లు కూలినా, ఇళ్లలోకి నీళ్లు చేరినా అత్యవసర హెల్ప్‌లైన్ 112కు సమాచారమివ్వండి. ప్రజల్లో భయాందోళనలు సృష్టించేలా తుఫాన్ తీవ్రతపై తప్పుడు సమాచారం లేదా వదంతులను సోషల్ మీడియాలో ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలూ అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మండి' అంటూ ఎస్పీ కోరారు.

'మొంథా' పట్ల అప్రమత్తంగా ఉండండి

- డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు
- సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు అప్రమత్తంగా వుండాలని సీఎండీ శివశంకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించాం. సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. తుఫాను తీరం దాటేవరకు అందరికీ సెలవులు రద్దు చేశాం. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలి. విద్యుత్ స్తంభాలు ఒరిగిన వెంటనే మరమ్మతులు చేయడానికి సిద్ధంగా ఉండాలి. కూలీలను అందుబాటులో ఉంచుకోవాలి. విద్యుత్ స్తంభాలు పడిపోయినపుడు, వైర్లు తెగినపుడు ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి టోల్ ఫ్రీ నెంబర్లు 1912 లేదా 1800 425 155333 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. సంస్థ వాట్సాప్ నెంబరు 91333 31912కు చాట్ చేయాలి' అని ఆ ప్రకటనలో సీఎండీ సూచించారు.

పాకాల - తోటపల్లె మార్గంలో వాహనదారుల ఇక్కట్లు



సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వచ్చిన వాహనాలకు సైడ్ ఇవ్వలేక అవస్థలు పడుతున్నడ్రైవర్లు

పాకాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పాకాల - తోటపల్లె రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాకాల నుంచి తోటపల్లె మీదుగా చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారికి అనుసంధానం ఉంది. ఈ రోడ్డులో పలువురు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఇది సింగిల్ రోడ్డు కావడంతో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇవ్వలేక అవస్థలు పడుతున్నారు. పలుచోట్ల మలుపులు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తెలియక ప్రమాదాలబారిన పడుతున్నారు. పాకాల - కొత్తకోట రోడ్డు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద కాస్త వర్షానికే నీళ్లు చేరడంతో చిత్తూరు - పాకాల ఆర్టీసీ బస్సులు పాకాల - తోటపల్లె రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటాయి. ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇవ్వలేక డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డును విస్తరించి జాతీయ రహదారికి అనుసంధానం చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఈ దారిలో ప్రయాణం సాగేదెలా..!



బురదమయంగా మారిన మట్టిదారి

తిరుపతి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల గ్రామ పంచాయతీలో వెటర్నరీ ఆసుపత్రి మీదుగా సచివాలయానికి వెళ్లే మార్గంలోని మట్టిదారిలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో వర్షపు నీరు నిల్వచేరి బురదమయంగా మారాయి. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. వాహనాన్ని నడిపేటప్పుడు ఏమాత్రం పట్టుతప్పినా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉంది. అలాగే గ్రామంలోని పలు సిమెంట్లు రోడ్లు ఛిద్రమై అధ్వానంగా మారాయి. కొన్ని వీధుల్లో మాత్రమే యూడీఎస్ సదుపాయముంది. పూర్తిస్థాయిలో సిమెంటు రోడ్లు, యూడీఎస్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో, తహసీల్దారు

భాకరాపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో గిడ్డయ్య, తహసీల్దారు భాగ్యలక్ష్మి ఆదేశించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సోమవారం వారు సమీక్ష నిర్వహించారు. అధికారులు వారికి అప్పగించిన గ్రామాలలో అందుబాటులో ఉండాలన్నారు. చెరువుల స్థితిగతులను పరిశీలించాలన్నారు. ప్రజలకు కలిగే ఇబ్బందులను కంట్రోల్ రూముకు తెలియజేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సతీశ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్వీ శిల్పకళాశాలలో వచ్చే ఐదేళ్ల పాఠ్యాంశాలపై సమావేశం

తిరుపతి అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ శిల్పకళాశాలలో వచ్చే ఐదేళ్ల పాఠ్యాంశాలపై సోమవారం ఏపీ సంప్రదాయ ఆలయ నిర్మాణం, సాంకేతిక విద్య, శిక్షణ సంస్థ నిపుణుల కమిటీ(ఎస్టీటీఈటీ) సమావేశమైంది. ప్రధానంగా ఆలయ నిర్మాణం, శిల్పశిక్షణ డిప్లమా కోర్సులలో కొత్త అంశాలు తీసుకురావడం, మార్పులు, చేర్పులకు నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎస్టీటీఈటీ కమిటీ కార్యదర్శి సత్యనారాయణమూర్తి, జాయింట్ సెక్రటరీ ఎ.రవికుమార్, డిప్యూటీ సెక్రటరి కె.లక్ష్మీపతి, టెక్నికల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్, టీటీడీ విద్యాధికారి టి.వెంకటసునీల్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి.విష్ణుభట్టాచార్యులు, శిల్పకళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడాలి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పరకామణి ఘటనలో నిందితులు ఎంతటి వారైనా శిక్షించి, తిరుమల పవిత్రతను కాపాడాలని హిందు సంఘాల నాయకులు కోరారు. పరకామణి, అన్నదానం, లడ్డు వ్యవహారాల్లో పూర్తి విచారణ చేపట్టాలని కోరారు. పరకామణిలో చోటుచేసుకున్న అవకతవకలపై పోరాడుతున్న టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. బత్తిన మధుబాబు, వెంకట్ రాయల్, హిమవంత్ రాగాల, సాయి, ఈశ్వర్, హరి, వేణురాయల్, నిర్మలమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కాలువ మళ్లింపుతో.. పొలాల్లోకి వరద నీరు



నందినీ హోటల్ సమీపంలో వంతెన వద్ద మళ్లించిన కాలువ

చంద్రగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి: చంద్రగిరి జాతీయ రహదారిలో నందినీ హోటల్ సమీపంలో వరద నీరు వచ్చే కాలువను మళ్లించడంతో వరద నీరు పొలాల్లోకి చేరుతోంది. సుమారు ఐదు అడుగుల మేర నిలిచిపోయింది. ఈ క్రమంలో పశువులకు మేత కూడా వేయలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా వరదనీరు పొలాల్లో నుంచి జాతీయ రహదారిపైకి ప్రవహిస్తుండటంతో వాహనదారులకూ ఇబ్బందులు తప్పడం లేదు. ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముంది. అధికారులు స్పందించి జాతీయ రహదారి పక్కన వంతెన కింద యథావిధిగా నీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.





పొలాల్లోకి దారి లేకుండా ముంచెత్తిన వరదనీరు, ప్లాట్‌ల నుంచి జాతీయ రహదారిపైకి వస్తున్న వరద నీరు

రేషన్ డీలర్‌పై దాడి బాధాకరం

డీలర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరనాయుడు

తిరుపతిరూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా మద్దిపాడు మండలం దొడ్డవరంలో రేషన్‌డీలర్ సుమన్‌పై సర్పంచ్ సుబ్బారావు దాడి చేయడం బాధాకరమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డీలర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి, తిరుపతి రూరల్ మండలాధ్యక్షుడు గుత్తా కోటేశ్వరనాయుడు కోరారు. బాధ్యతగల ప్రజాప్రతినిధి పదవిలో ఉంటూ డీలర్‌పై దాడి చేయడాన్ని సంఘ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. వెంటనే సుబ్బారావుపై కేసు నమోదు చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కోటి లింగేశ్వరస్వామికి వైభవంగా తిరుమంజనం



విశేషాలంకారంలో కోటి లింగేశ్వరస్వామి

రామచంద్రాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా రాయలచెరువుకట్ట కామాక్షి సమేత కోటి లింగేశ్వరస్వామి, భవానీ జలకంఠేశ్వరస్వామికి వైభవంగా తిరుమంజనం నిర్వహించారు. ఆలయంలో విశేష పూజల అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. వందలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ పుష్కరిణి వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్ పారిశుధ్య పనులు



చంద్రగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చినాయుడుపల్లెలో సోమవారం తిరుపతి ఎస్వీ, చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ఎన్‌సీసీ క్యాడెట్స్ పారిశుధ్య పనులు చేపట్టారు. బుచ్చినాయుడుపల్లె పంచాయతీని వారు దత్తతకు తీసుకున్నారు. బుచ్చినాయుడుపల్లె వద్ద స్వర్ణముఖి నదిని శుభ్రం చేశారు. రోడ్లు, పరిసర ప్రాంతాలు, నీళ్ల ట్యాంక్‌లను శుభ్రం చేశారు. తడి చెత్త, పొడి చెత్త గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కల్నల్ కడియాల శ్రీనివాసులు, సర్పంచ్ రవి నాయుడు, సుబేదార్, మణికందన్, పట్టాభిరామనాయుడు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా భూమన వ్యాఖ్యలు: కోడూరు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి):: ఇంకా ఆయన టీటీడీ ఛైర్మన్‌లా ప్రవర్తిస్తూ, ప్రతి అంశాన్నీ రాజకీయం చేయడానికి ప్రయత్నించడం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ భూమన కరుణాకరరెడ్డిపై టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'టీటీడీ అనేది రాజకీయ వేదిక కాదు. కోట్లాది మంది ఇది హిందువుల విశ్వాసానికి ప్రతీక. అలాంటి చోట ప్రతి చిన్న అంశానికీ ఇటీవల భూమన వ్యాఖ్యానాలు చేయడం, వివాదాలను సృష్టించడం చాలా విచారకరం. టీటీడీలోని ప్రతి అధికారి, సిబ్బంది భక్తితో, నియమంతో భక్తులకు సేవ చేస్తున్నారు. తిరుమల క్షేత్ర అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల పెంపునకు ప్రస్తుత ఛైర్మన్, బోర్డు పనిచేస్తున్నారు. ఇలాంటి సమయంలో మీ వ్యక్తిగత గుర్తింపు కోసం లేదా రాజకీయ లాభం కోసం టీటీడీని వివాదాల వేదికగా మార్చడం తగదు' అని ఆ ప్రకటనలో బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

నిండుతున్న రాయలచెరువు

- తుఫాన్ నేపథ్యంలో హెచ్చరికలు





రాయలచెరువులో మునుగుతున్న నీటిని కొలిచే మిద్దె, సీకేపల్లిలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

రామచంద్రాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాయలచెరువుకు వరద నీరు చేరుతోంది. అనుపల్లి అడవుల నుంచి వచ్చే సుద్దేటివంక ఉధృతంగా ప్రవహిస్తూ రాయలచెరువులో కలుస్తోంది. మరోవైపు అనుపల్లి చెరువు పూర్తిస్థాయిలో నిండి మొరవపారుతూ సుద్దేటివంకలో కలుస్తోంది. రాయలచెరువులో నీటిని కొలిచే రాయల కాలంనాటి మిద్దెలు మునుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాలైన సీకేపల్లి, కాలేపల్లి, సూరావారిపల్లె, వడ్డికాలువ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువు సమీపానికి వెళ్లవద్దని హెచ్చరించారు. తహసీల్దారు మధుసూదన్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, ఎస్‌ఐ భక్తవత్సలం, ఇరిగేషన్ ఏఈ రాయలచెరువు పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

శివాలయాల్లో కార్తీక మాస పూజలు







ముక్కోటిలో రుద్రాభిషేకం అలంకరణలో స్వామివారు, విశేషాలంకరణలో ఆనందవల్లిదేవి, పుట్టాలమ్మ ఆలయంలో కైలాసపర్వత అలంకరణలో స్వామివారు

చంద్రగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. తొండవాడ వద్ద స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామికి రుద్రాభిషేకం, ఆనందవల్లిదేవికి అభిషేకం చేశారు. స్వామివారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో (పుట్టాలమ్మ ఆలయం) స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. కైలాసపర్వత అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మహిళలు దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముక్కోటి ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, పుట్టాలమ్మ ఆలయ శైవాగ పండితులు శివకుమార్ శర్మ, ఆలయ కమిటి పాల్గొన్నారు.

పాకాల పెద్దచెరువు నీళ్లు ఏటిపాలు



నాలుగేళ్ల క్రితం పాకాల పెద్ద చెరువు కట్ట కుంగిపోవడంతో వేసిన ఇసుక బస్తాలు

పాకాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధానమైన పాకాల పెద్దచెరువు నీరు మూడు రోజులుగా ఏటిపాలవుతున్నాయి. ఈ చెరువు నిండితే సుమారు 300ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, పరిసర గ్రామాల ప్రజలకు తాగునీరు, భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీరు పుష్కలంగా ఉంటాయి. నాలుగేళ్ల క్రితం కురిసిన వర్షాలకు ఈ చెరువు పూర్తి స్థాయిలో నిండింది. చెరువు కట్ట కుంగడంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చెరువు మొరవ తెగ్గొట్టి నీళ్లు వదిలేశారు. ఆపై శాశ్వత మరమ్మతులు చేయకుండా మొరవ కొట్టేసిన ప్రాంతంలో ఇసుక బస్తాలు ఉంచారు. మరోసారి కురిసిన వర్షాలకు ఇసుక బస్తాలు కూడా కొట్టుకుపోయాయి. అర్ధచెరువు నీళ్లు మాత్రమే మిగిలాయి. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు గానుగపెంట సమీపంలోని రామసముద్రం చెరువు, పెద్దరామాపురం సమీపంలోని అమ్మచెరువు మొరవలు పాకాల పెద్దవంకలో ప్రవహించి పాకాల పెద్దచెరువుకు చేరాయి. మూడు రోజులుగా వచ్చిన నీరు వచ్చినట్లుగా మొరవలో దిగువకు వెళ్లిపోతున్నాయి. ఎన్టీఆర్ జలాశయంలో కలిసి చిత్తూరు, గుడిపాల మండలాల మీదుగా తమిళనాడు కాట్పాడి పొన్నై ఏరులో కలిసిపోతాయి. కుంగిపోయిన చెరువుకట్ట, తెగ్గొట్టిన మొరవ పనులు ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతు పనులు చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మొరవపోతున్న పాకాల పెద్దచెరువు

వెంకట మోహన్‌కు రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్

- జాతీయ స్థాయిలో ఎస్వీయూ పూర్వ విద్యార్థికి గుర్తింపు
- పర్యావరణ పరిశోధన కృషికి విశిష్ట గుర్తింపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పూర్వ విద్యార్థి డాక్టర్ ఎస్. వెంకటమోహన్ జాతీయ స్థాయిలో గుర్తింపును సంతరించుకున్నారు. సీఎస్‌ఐఆర్ పరిధిలోని నాగ్‌పూర్‌లో గల నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్‌గా ఆయన వ్యవహరిస్తున్నారు. పర్యావరణ రంగంలో చేపట్టిన గొప్ప పరిశోధనకు రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్-2025 కు ఆయన ఎంపికయ్యారు. దీనిపై ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. వెంకటమోహన్ ఎస్వీయూలోనే పీహెచ్‌డీ పూర్తి చేశారని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో ప్రభాస్ చెల్లెళ్లు



సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న దివంగత నటుడు కృష్ణమరాజు కుమార్తెలు, ప్రభాస్ చెల్లెళ్లు సాయిప్రదీప్తి, ప్రవల్లిక

ఎగువకుంట చెరువు కట్టకు లీకేజీ





ఎస్సీ హాస్టల్‌లోకి నీరు వెళ్లకుండా కాలువ తీస్తున్న అధికారులు (ఇన్‌సెట్లో) ఎగువకుంట కట్టలో ఏర్పడిన లీకేజీ

భాకరాపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుపాను వల్ల కురిసే వర్షాలకు చెరువులు నిండుతున్నాయి. చిన్నగొట్టిగల్లు మండలంలోని దీన్‌దార్లపల్లె పంచాయతీ తవ్వావాండ్లపల్లె గ్రామ సమీపంలో ఉన్న ఎగువకుంట చెరువు పూర్తిస్థాయిలో నిండింది. చెరువు కట్టలో లీకేజీ ఏర్పడి మట్టి కిందకు జారిపోయింది. నాయకులు, రైతులు గమనించి ఇరిగేషన్ ఈఏ రూపేశ్‌కు తెలియజేయడంతో వెంటనే ఆయన వెళ్లి చెరువు కట్టను పరిశీలించి లీకేజీ అరికట్టే ఏర్పాట్లు చేపట్టారు. అలాగే భాకరాపేట ఎస్సీ హాస్టల్‌లోకి వర్షపు నీరు రాకుండా పక్కన ఉన్న మురుగునీటి కాలువను శుభ్రం చేయించారు. ఎస్సీ హాస్టల్ ఆవరణ పల్లంగా ఉండడంతో చుట్టుపక్కల పడే వర్షపు నీరు హాస్టల్లోకి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి



ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంఈవో-2 గోపినాథ్

భాకరాపేట: విద్యార్థులు తమ ఆధార్‌లో ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని ఎంఈవో-2 గోపినాథ్ అన్నారు. చిన్నగొట్టిగల్లు ఎంఆర్సీలో సోమవారం ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డుల్లో పేర్లు, చిరునామాలు, పుట్టిన తేదీలలో మార్పులు ఉంటే సరిదిద్దు కోవాలన్నారు. ఆధార్ నమోదు చేసుకుని పదేళ్లు పూర్తయిన వారు అప్‌డేట్ చేసు కోవాలన్నారు. సీఆర్పీలు ప్రవీణ్, శ్రీరాములు, మధు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ హేమంత్, రవి పాల్గొన్నారు.

'గజ' బాధిత రైతులకు ఎమ్మెల్యే భరోసా





చిన్నరామాపురంలో అటవీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, కొండ్రెడ్డికండ్రిగ వద్ద ధ్వంసమైన గేట్లను పరిశీలిస్తున్న నాని

చంద్రగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజులుగా ఏనుగులు సంచరిస్తున్న ఎ.రంగంపేట, చిన్నరామాపురం, భీమవరం, కొండ్రెడ్డికండ్రిగ, శేషాపురం, కందులవారిపల్లె, గ్రామాల్లో ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం పర్యటించారు. ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించారు. చిన్నరామాపురంలో ఏనుగులు గ్రామంలోకి రావడంతో గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం మూలపల్లి గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూలపల్లి చెరువును పరిశీలించారు. నీరొచ్చినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొండ్రెడ్డికండ్రిగ చెరువును పరిశీలించారు. చెరువులో నీళ్లు నిలిచే విధంగా తూములు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మామిడిమానుగడ్డ వద్ద భీమానది వంతెనను పరిశీలించారు. రాత్రివేళ బయట తిరగవద్దని రైతులకు సూచించారు. మొంథా తుఫాన్ కారణంగా పిల్లలను కాలువలు, కుంటలు, చెరువులు, వంకల వద్దకు పంపించవద్దన్నారు. ఏనుగులను దారి మళ్లించేందుకు ప్రయత్నించాలని అటవీ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో వెంకటరత్నం, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, క్లస్టర్ ఇన్‌చార్జ్ పోతల ప్రవీణ్, వెంకటపతినాయుడు, హేమాద్రినాయుడు, గిరినాయుడు, నిరంజన్ నాయుడు, మరుపూరి కుమార్, రాజశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అదనపు ఫీజు వసూలు చేసే కళాశాలలపై చర్యలు

- ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు ఆర్ఎస్ఏ నేతల వినతి

తిరుపతిరూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): కన్వీనర్ కోటా ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అదనపు ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ న్యాయ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌ను కలసి వినతిపత్రం అందించినట్లు ప్రకటించారు. తిరుపతి, పుత్తూరులో ఎస్వీయూకు అనుబంధంగా నిర్వహిస్తున్న కళాశాలల్లో కొన్నేళ్లుగా అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. విచారించి విద్యార్థులు అదనంగా చెల్లించిన నగదును తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మేనేజ్‌మెంట్ సీట్లలో తమిళనాడు విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తూ జిల్లాలోని విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తున్నారని వాపోయారు. మాజీ వీసీ అప్పారావు ఓ కళాశాలను సందర్శించి, జరిమానా విధించారని, అయినా యాజమాన్యాల్లో మార్పు రాలేదని పేర్కొన్నారు. గిరిజన సమాజ్ అధ్యక్షుడు ఎం.మహేంద్రనాయక్, ఆర్ఎస్ఏ ప్రతినిధులు కె.తిరుమలేష్ పాల్గొన్నారు.



ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్ఎస్ఏ నేతలు

ఘనంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న వీసీ కృష్ణమూర్తి, రిటైర్డు ఎస్పీ స్వామి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీలో విజిలెన్స్ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వీసీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అందరితో ప్రతిజ్ఞ చేయించారు. విధి నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక బాధ్యత విలువలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. రిటైర్డు ఎస్పీ ఎం.వి.ఎస్.స్వామి మాట్లాడుతూ జీవితంలోని అన్ని అంశాలలో పారదర్శకతను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. సమగ్రతను ప్రోత్సహించడం, అవినీతిని నిరోధించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ సత్యనారాయణాచార్య, కో-ఆర్డినేటర్ చారుకేష్, కో కో-ఆర్డినేటర్ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సోమనాథ్ దాస్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ సోమనాథ్ దాస్ కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారాన్ని స్వీకరించారు. ఒడియా రచయిత బ్రజ్‌మోహన్ మొహంతి నవల లలిత్ లవంగ్‌ను సంస్కృతంలోకి అనువదించినందుకు ఈ పురస్కారాన్ని పొందారు. కోల్‌కతాలో నిర్వహించిన సభలో రూ.50 వేల నగదు, జ్ఞాపికతో ఆయన్ను సత్కరించారు. వీసీ కృష్ణమూర్తి అభినందించారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న నేతలు

తిరుపతి (ఆటోనగర్), అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలో మీటర్ రీడింగ్ తీసుకుంటున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడింగ్ యూనియన్ నాయకులు సదరన్ డిస్కం సీఎండీ లోతేటి శివశంకర్‌ను కోరారు. సోమవారం డిస్కం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం ఇచ్చారు. మీటర్ రీడర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు రామకృష్ణ, రమేష్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వైకుంఠద్వార దర్శనాన్ని పది రోజులు కొనసాగించాలి

తిరుపతి(జీవోకోన), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజుల పాటు యథావిధిగా కొనసాగించాలని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి సోమవారం అన్నారు. సామాన్య భక్తులను దృష్టిలో ఉంచుకుని పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాన్ని యథావిధిగా కొనసాగించాలని, రెండు రోజులకే పరిమితం చేయొద్దని కోరారు.

కారు ఢీకొని ఒకరి మృతి

పూతలపట్టు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. పాకాల మండలం చెన్నుగారిపల్లె గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు ప్రతాప్, అదే గ్రామానికి చెందిన రాజేష్ ఆదివారం రాత్రి పని నిమిత్తం పూతలపట్టుకు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. వేము ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో తిరుపతి నుంచి చిత్తూరు వైపుగా వస్తున్న కారు ఢీకొంది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రతాప్ పరిస్థితి విషమించడంతో తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ సేవలు



తిరుపతి రూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఆధార్ సేవలు నిర్వహిస్తున్నారు. పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై ఈ సేవలను పొందారు. నిర్వాహకులు బాబీ మాట్లాడుతూ పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటామని, వివరాల కోసం 8498044168ను సంప్రదించాలని కోరారు.

షికారీ కాలనీలోకి నీరు
తొలగించిన పంచాయతీ సిబ్బంది



తిరుచానూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తిరు చానూరు గ్రామ పంచాయతీ పరిధిలోని షికారీ కాలనీ(నక్కలకాలనీ)లోకి వర్షపు నీరు చేరుతోంది. ఎప్పటికపుడు పంచాయతీ ఈవో మణి, సిబ్బంది తోడివేస్తున్నారు. భారీ వర్షం వస్తే కాలనీ వాసులను సురక్షిత ప్రాంతానికి తరలించడానికి జడ్పీ ఉన్నత పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేశామని చెప్పారు. పంచాయతీ పరిధిలో ఎప్పటికపుడు పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు.

కల్యాణం..కమనీయం



మాంగల్యాన్ని చూపుతున్న అర్చకుడు, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : స్థానిక కపిలేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అవరణలోని ఆంజనేయ స్వామి సన్నిధికి సమీపంలో ఏర్పాటు చేసిన వేదికలో ఈ మహోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు సర్వాలంకారం చేసి కొలువుదీర్చారు. తొలుత గణపతి పూజతో ప్రారంభించి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వేడుకగా అర్చకులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించి పులకించిపోయారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఓబీసీల్లో ఉత్సాహం నింపాలి



బండారు దత్తాత్రేయను సన్మానిస్తున్న శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీల్లో ఉత్సాహం నింపాలని బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ దక్షిణ భారత ఓబీసీ అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులుకు సూచించారు. సోమవారం హైదరాబాదులో ఆయన్ను శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలసి, సన్మానించారు. సౌతిండియా ఓబీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన విషయాన్ని గుర్తు చేయగా దత్తాత్రేయ అభినందించారు. మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ నాయకులు గుజ్జ కృష్ణ, భూపేష్‌సాగర్, రామకృష్ణ పాల్గొన్నారు.

పీజీ, పీహెచ్‌డీ సెట్ నిర్వహణ యూనివర్సిటీలకే ఇవ్వండి

● ఏపీ విద్యార్థి జేఏసీ



మధుమూర్తికి విన్నవిస్తున్న హేమాద్రి యాదవ్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాల నిర్వహణ బాధ్యతలను ఆయా యూనివర్సిటీలకే అప్పగించాలని ఏపీ విద్యార్థి జేఏసీ కన్వీనర్ హేమాద్రి యాదవ్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తికి సోమవారం ఆయన విన్నవించారు. హేమాద్రి యాదవ్ మాట్లాడుతూ..ఉమ్మడి పీజీ, పీహెచ్‌డీ సెట్ల నిర్వహణతో యూనివర్సిటీల్లో అడ్మిషన్ల సంఖ్య విపరీతంగా తగ్గి పోయిందన్నారు. ఆయా యూనివర్సిటీలకే సొంతంగా అప్పగిస్తే అడ్మిషన్ల సంఖ్య పెరుగుతుందన్నారు. మధుమూర్తి మాట్లాడుతూ దీనిపై ప్రభుత్వానికి ఇదివరకే నివేదించామని, ప్రభుత్వం అనుమతించిన వెంటనే బాధ్యతలను యూనివర్సిటీలకే అప్పగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేంద్ర, తిరుమలేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

నగరానికి కార్తీక శోభ



కార్తీకమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో రద్దీ నెలకొంది. ఆలయం లోపల రాగి, వేపచెట్ల కింద, నాగశిలల వద్ద పూజలు చేశారు. శివలింగం, నాగశిలలకు నీళ్లు పోసి పసుపు, కుంకుమలతో అలంకరించి, కర్పూర హారతులు ఇచ్చారు. ఆంజనేయ స్వామి సన్నిధికి సమీపంలోని ఉద్యానవనంలో దీపాలు వెలిగించారు. పిండి, నిమ్మకాయలు, ఉసిరి కాయల్లో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

- తిరుపతి (కల్చరల్)



'నా జీవితం నల్లేరు మీద బండి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని అవిష్కరిస్తున్న సాహితీ ప్రతినిధులు

తిరుపతి (కల్చరల్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రచయిత సాకం నాగరాజు రచించిన నా జీవితం నల్లేరు మీద బండి పుస్తకావిష్కరణ సోమవారం స్థానిక బైరాగి పట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగింది. పలువురు సాహితీవేత్తలు మాట్లాడుతూ ప్రపంచ దిగ్గజాలైన ఎలాన్‌మస్క్, సుందర్ పిచాయ్, సుధామూర్తి వంటి వారు వ్యాపార రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి పుస్తకాలే కారణంగా పేర్కొన్నారు. ప్రపంచ జ్ఞానం పుస్తకాల వల్లే సమకూరుతుందన్న వాస్తవాన్ని పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ సంస్థల ప్రతినిధులు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, మన్నవ గంగాధర ప్రసాద్, తమటం రామచంద్రారెడ్డి, తోట వెంకటేశ్వర్లు, నాదెండ్ల శ్రీమన్నారాయణ, మస్తానమ్మ, మోహన మునిసిద్ధారెడ్డి, పేరూరు బాలసుబ్రమణ్యం, వాకా ప్రసాద్, మల్లారపు నాగార్జున, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్ కుమార్ రాజు, రోటరీ క్లబ్ సభ్యులు టెంకాయల దామోదరం పాల్గొన్నారు.

బలిజ భవన్ నిర్మాణానికి నిధులివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న బలిజ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బలిజ భవన నిర్మాణానికి వెంటనే నిధులు విడుదల చేయాలని బలిజ సంఘాల ప్రతినిధులు కోరారు. సోమవారం ఓ ప్రైవేటు హోటల్లో బలిజ భవన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు వి.శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో పేద బలిజ విద్యార్థులు వసతిగృహం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పేద బలిజలు వివాహాలు, ఇతర వేడుకలు జరుపుకోవడానికి వీలుగా బలిజ భవన్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేయగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణానికి రూ.10లక్షలు ఆర్థికసాయం చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోడూరు బాలసుబ్రహ్మణ్యం, చిన్నారాయలు, గుత్తా నాగరాజరాయల్, రెడ్డి శేఖర్ రాయల్, బుల్లెట్ రమణ, దేవూరు భాస్కర్, విజయ్‌కుమార్, క్రికెట్ విజయ్‌కుమార్, బండ్ల లక్ష్మీపతిరాయల్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా దక్షిణామూర్తి హోమం



సర్వాలంకారభూషితుడై దర్శనమిస్తున్న దక్షిణామూర్తి, పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కపిలేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న హోమ మహోత్సవాల్లో భాగంగా సోమవారం దక్షిణా మూర్తి హోమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ అవరణలోని ఆంజనేయ స్వామి సన్నిధికి సమీపం లో ఏర్పాటు చేసిన వేదికపై దక్షిణామూర్తి ఉత్సవమూర్తికి సర్వాలంకారాలు చేసి కొలువుదీర్చారు. కలశ స్థాపన చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం చేశారు. హోమగుండం వెలిగించి, తొలుత గణపతి పూజ చేసి దక్షిణామూర్తి హోమాన్ని వేదయుక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శవ రాజకీయాలు వద్దు



మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రజలంతా బాధలో ఉంటే వైసీపీ నేతలు, సాక్షి మీడియా దుష్ప్రచారం చేయడం బాధాకరమని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సత్యమేవ జయతే అని పేరు పెట్టుకున్న సాక్షి మీడియా అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. కల్తీ మద్యం తాగిన బైకర్ బస్సు ప్రమాదానికి కారణమని తప్పుడు కథనాలు సృష్టించారని, కానీ విచారణలో లైసెన్సు పొందిన వైన్‌షాప్ నుంచే మద్యం కొనుగోలు చేసినట్లు తేలిందని అన్నారు. స్వలాభం కోసం ఇలాంటి అసత్యాలు ప్రచారం చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారం వల్లే 11 సీట్లకు పరిమితమైందని విమర్శించారు. గూగుల్ డేటా సెంటర్ ఆంధ్రప్రదేశ్‌కు రావడం ఇష్టంలేక వైసీపీ ఇలాంటి ప్రచారాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తాతయ్యగుంట గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి తోట వాసురాయల్, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు హేమంత్‌రాయల్, రంజిత్‌నాయుడు, లోకేష్‌రాయల్, మధు, గోపి, శరత్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ

- పలుచోట్ల హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు
- తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 9392054152



పాడిపేటకి వెళ్లే మార్గంలో స్వర్ణముఖి నది వద్ద హెచ్చరిక బోర్డులు

తిరుపతిరూరల్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో తిరుపతి రూరల్ మండలంలోని పలు గ్రామాలను సోమవారం ఉదయం రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులు సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. నది, నీరు ప్రవహించే ప్రాంతాలకు వెళ్లవద్దని అప్రమత్తం చేశారు. పలుచోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పేరూరు చెరువులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో చేపలు పట్టడం, ఈతకొట్టడం, ప్రవేశించడం వంటివి నిషేధించారు. చెర్లోపల్లె పంచాయతీలోని చెరువులో, ఇండ్లలో నివాసం ఉంటున్న వారిని బయటకు తరలించే విధంగా చర్యలు చేపట్టారు. తిరుచానూరులో నందకం లేఅవుట్ మార్గం మీదుగా స్వర్ణముఖి నదిలోకి వెళ్లే దారిని బారికేడ్లతో మూసేశారు. పాడిపేటకి వెళ్లేమార్గంలో నదికి సమీపంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మండలంలో 15 రిలీఫ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయం కేంద్రంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రామాంజుల నాయక్ మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని, ప్రతి కుటుంబమూ ముందుగానే నిత్యావసర సరుకులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు గమనించినా కంట్రోల్‌రూమ్ 9392054152ని సంప్రదించాలని కోరారు.

ఐఆర్‌సీటీసీ షిరిడీ, జ్యోతిర్లింగ యాత్ర

● 8రోజుల ప్యాకేజీ టూర్

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేకు అనుబంధంగా ఉన్న ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో దక్షిణ భారత దేశం నుంచి ఉత్తర భారత దేశంలోని ఐదు పుణ్యక్షేత్రాలు దర్శించుకోవడానికి వీలుగా 8రోజుల ప్యాకేజీ టూర్‌ను ఏర్పాటు చేశామని ఐఆర్‌సీటీసీ సౌత్‌జోన్ జనరల్ మేనేజరు కె.రవికుమార్ వెల్లడించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ పర్యాటక ప్రత్యేక రైలు నవంబరు 9వ తేదీ తమిళనాడులోని తిరునల్వేలిలో బయలుదేరి మధురై, తిరుచ్చి, చెన్నైల మీదుగా రేణిగుంటకు మరుసటి రోజు ఉదయం చేరుకుంటుంది. అక్కడి నుంచి కడప, గుత్తి, గుంతకల్లు స్టేషన్ల మీదుగా పంచవటి, త్రయంబకేశ్వరం, షిర్డిసాయి మందిరం, శనిసింగనాపూర్, పండరీపూర్‌లోని శ్రీవిఠల్ రుక్మిణీ ఆలయం, మంత్రాలయంలో శ్రీగురు రాఘవేంద్రస్వామి ఆలయాలను దర్శించుకోవచ్చని తెలిపారు. తిరిగి 16వ తేదీ ఉదయం రేణిగుంటకు, అక్కడి నుంచి బయలుదేరి రాత్రికి తిరునల్వేలికి చేరుకుంటుందని వెల్లడించారు.

ప్యాకేజీ వివరాలు: ఒక్కొక్కరికి సెకండ్ స్లీపర్ రూ14,400, 3ఏసీ రూ26,000, 2ఏసీ రూ36,500లుగా నిర్ణయించామన్నారు. పర్యాటకులకు భద్రత, వసతి, రవాణా, తాగునీరు, ఉచిత భోజన వసతులు ఉంటాయన్నారు. వివరాలకు, 500- 8287932063, 9363488323, 9003140682లకు సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా రైల్వే కోడూరులో ఈ నెల 26, 27తేదీల్లో జరిగిన 69వ స్కూల్‌గేమ్స్ అండర్ 19 తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభచాటారు. స్థానిక ఎస్ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థులు బి.గౌతమ్‌కుమార్, ఎస్.సాహిల్ బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. వచ్చేనెల 8న జమ్మూకశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే రిషిత-రజతం, జె.ధ్యానేష్, గణేశ్వర్, హేతిక, నిరంజన్ కాంస్య పతకాలు సాధించారు. వారిని కళాశాల యాజమాన్యం, కోచ్ ఎ.బాలకృష్ణ, అవినాష్, గౌతమ్‌కుమార్ అభినందించారు.

ఎవరైనా లంచం అడిగితే 1064కు సమాచారం ఇవ్వండి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనులకోసం ఎవరైనా లంచం అడిగితే వెంటనే 1064కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని అవినీతి నిరోదక శాఖ ఏఎస్పీ విమల కుమారి విజ్ఞప్తిచేశారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం తిరుపతిలోని ఏసీబీ ఆధ్వర్యంలో అవగాహనా కార్యాక్రమం నిర్వహించారు. ఏసీబీ సిబ్బందిచే అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞచేయించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు.. ర్యాలీలు, సైకిల్ మారథాన్లు నిర్వహిస్తామన్నారు.


కొడాలి నాని, పేర్ని నాని

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.., వైసీపీ మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, సినీనటులు రాకేష్, సుజాత ఉన్నారు. అంతకుముందు కర్ణాటక శ్రీకూడలి ఆర్య అక్షభ్య మఠాధిపతి రఘువిజయతీర్థ స్వామిజీ కూడా ఉదయం నైవేద్య విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.


రాకేష్, సుజాత దపంతులు


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,021

తలనీలాలు సమర్పించినవారు: 25,894



ఆర్టీసీ అప్రమత్తం

- ఏసీ బస్సుల కండిషన్‌పై ముమ్మర తనిఖీలు
- వేగ నియంత్రణకూ చర్యలు


అమరావతి ఏసీ బస్సు ఇంజన్‌ను తనిఖీ చేస్తున్న సిబ్బంది


బస్సులో అత్యవసర ద్వారం పరిశీలన

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 'కర్నూలు' ప్రమాదం నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. బస్సుల కండిషన్‌పై మూడు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 డిపోలుండగా మంగళం డిపో ద్వారానే 23ఏసీ బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సులన్నీ కాలపరిమితి ముగిశాయి. నూతన బస్సులు రాకపోవడంతో ఉన్న బస్సులకే ఎప్పటి కప్పుడు విడిభాగాలను మారుస్తూ, రంగులు వేస్తూ నెట్టుకొస్తున్నారు. మొన్నటి వరకు దీన్ని పెద్దగా పట్టించుకోకపోయినా.. ఇప్పుడు అధికారుల్లో ఆందోళన నెలకొంది. దీంతో అన్ని బస్సుల కండిషన్, అదనపు సౌకర్యాలు కల్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో మంగళం డిపోలో అమరావతి, వెన్నెల, ఇంద్రా బస్సుల్లోని విడి భాగాలను తనిఖీ చేస్తున్నారు. బస్సు ముందు, వెనుక రెండు అగ్నినివారణ యంత్రాల ఏర్పాటు, ప్రతి కిటికీ వద్ద సేఫ్టీ హ్యామర్స్, అత్యవసర ద్వారాలు, ఎలక్ట్రిక్ విధానం మెరుగుపరచడం, ఆయిల్ లీకేజీ కాకుండా చర్యలు చేపట్టారు. బ్రేక్స్, స్టీరింగ్‌ను మరింత సరిచేయడం, డ్రైవర్ల భద్రతకు హెడ్, ఫాగ్, సిగ్నల్స్ లైట్స్, వైపర్స్‌ను నూతనంగా ఏర్పాటు చేయనున్నారు. ఇంజన్ చెక్ చేస్తున్నారు. లాంగ్ సర్వీసుల్లో ఇద్దరు డ్రైవర్లను విధిగా పంపడం, బస్సులో డ్రైవర్ విశ్రాంతికి ప్రత్యేక సీటు ఏర్పాటు, ఓల్వో ట్రైనింగ్ అయిన డ్రైవర్లనే అనుమతించడం, డ్యూటీ ఎక్కేసమయంలో ప్రతి డ్రైవర్‌ను అప్రమత్తం చేయడం, డ్రైవర్లచే ప్రయాణికులకు రక్షణ ఏర్పాట్లు వంటి వాటిపై అవగాహన కల్పించే చర్యలు తీసుకున్నారు. అమరావతి బస్సు స్పీడు 90కిలోమీటర్లు, ఇంద్రా, వెన్నెల 80కిలోమీటర్ల వేగాన్ని అధిగమించకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు. ప్రయాణంలో సమయపాలన కచ్చితంగా పాటించేలా డ్రైవర్లకు డిపో మేనేజర్ సుధాకర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే, తిరుమల, రేణిగుంట, మదనపల్లె, కడప, నెల్లూరుకు నడుస్తున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సులలో కూడా చెకింగ్ జరుగుతున్నాయి. అద్దె బస్సుల యాజమాన్యం కాస్త నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు ఆరోపణలున్నాయి.

370 సప్తగిరి బస్సులతో హైటెన్షన్

2018వ సంవత్సరం ముందు వచ్చిన దాదాపు 370సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఘాట్‌లో తిరుగుతూ.. వీటి కాల పరిమితి ఆరు లక్షల కిలోమీటర్లను అధిగమించాయి. ప్రస్తుతం 9-10లక్షల మధ్య నడుస్తుండటంతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో కొన్ని విడిభాగాలు మార్చి..సాంకేతికతను మెరుగు పరిచినా.. మళ్లీ వీటి కండిషన్‌ను తనిఖీ చేస్తున్నారు.

ఇతర బస్సులపైనా ప్రత్యేక దృష్టి : జిల్లాలోని మిగతాపాతబస్సుల కండిషన్, బ్రేకొసిస్టమ్, స్టీరింగ్, ఇంజన్, ఇతర భాగాల పనితీరు, లైటింగ్, ఎలక్ట్రిక్ సిస్టమ్స్‌ను తనిఖీచేసి మరింత మెరుగుపరిచే చర్యలు చేపట్టారు. పూర్తిస్థాయిలో ఫిట్‌గా ఉంటేనే రోడ్డెక్కించాలని డీపీటీవో జగదీష్ ఆయా డిపోమేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. అద్దెబస్సుల యజమానులతోనూ సమావేశమై వాటి కండిషన్ తనిఖీ చేయించాలని కోరారు.

వేగానికి అదుపేదీ?

- దూసుకెళ్తున్నప్రైవేటు బస్సులు
- ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు, ఎఫ్‌సీలు
- డొల్ల తనిఖీలతో రోడ్లపై ఫిట్‌లెస్ వాహనాలు
- ఆగని ప్రమాదాలు



రేణిగుంట వద్ద గతేడాది ప్రమాదంలో కాలిన బస్సు (ఫైల్ ఫొటో)

- గతేడాది మే 19న ఓ ట్రావెల్ బస్సుకు రేణిగుంట వద్ద టైర్లు పేలాయి. దాదాపు 10 మంది గాయపడ్డారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 2న నగరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు బస్సు నుజ్జు నుజ్జు అయింది. ఇద్దరు మృతి చెందగా 10 మంది గాయపడ్డారు.
- ఈ నెల 23న ఉదయం ప్రైవేటు ట్రావెల్ బస్సుకు పెన్నేపల్లి వద్ద మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది.
- ఈ నెల 24న వాకాడు డిపో పల్లె వెలుగు ఆర్టీసీ బస్సుకు తుమ్మూరులో బ్రేక్ డ్రమ్‌లో నుంచి పొగలు వ్యాపించాయి. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

జిల్లాలో అడపాదడపా బస్సు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో ప్రైవేట్ బస్సులే ఎక్కువ. సంఘటన జరిగినప్పుడల్లా అధికారులు హడావుడి చేయడం, తర్వాత మిన్నకుండిపోవడం సాధారణమైపోయింది. తాజాగా కర్నూలులో జరిగిన ఘోర దుర్ఘటనతో అందరూ ఒక్కసారిగా గుర్పాటుకు గురయ్యారు. ఈ క్రమంలో మన దగ్గర ప్రైవేట్ బస్సుల సామర్థ్యం పరికిస్తే డొల్లతనమే బయటపడుతోంది. కలవరపాటు కలిగిస్తోంది. బాధ్యత వహించాల్సిన రవాణాశాఖ నామమాత్రపు తనిఖీలకే పరిమితమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో ప్రైవేటు బస్సులకు సంవత్సర ట్యాక్సు అతి తక్కువ. దీంతో 80 శాతం ప్రైవేటు ట్రావెల్ బస్సులు మిజోరాం, నాగాలాండ్, అరుణాచలప్రదేశ్, డయ్యూ డామన్ వంటి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నాయి. తిరుపతి నుంచి దాదాపు 40 నుంచి 50 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు వివిధ ప్రాంతాలకు నడుపుతున్నారు. వీటి సామర్థ్యంపై ఇప్పుడు ఆందోళన వ్యక్తమవుతోంది.

కొంపముంచుతున్న నకిలీ ఎఫ్‌సీలు

ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న ట్రావెల్స్ యాజమాన్యాలు అక్కడే ఇన్సూరెన్సు, ఎఫ్‌సీలు తీసుకుంటున్నాయి. ట్రావెల్స్ బస్సుకు రెండేళ్లకోసారి ఎఫ్‌సీ చేసుకోవాలి. తిరుపతి మీదుగా తిరుగుతున్న బస్సులకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రాంతంలో రవాణా శాఖ అధికారులు తనిఖీ చేసి, ధ్రువీకరించాక రాకపోకలు సాగించాలి. అక్కడకు వెళ్లకుండా ఎఫ్‌సీలు తెచ్చుకుంటున్నారని తెలుస్తోంది. దీంతో ఇక్కడి రవాణా శాఖ అధికారులు కూడా వాటికి జోలికి పోవడంలేదు. ఫలితంగానే తరచూ ఏదో ప్రమాదం జరుగుతోందనే వాదన ఉంది. కొన్ని పూర్తిగా పాతవైపోయాయి. నాన్ ఏసీ బస్సులను ఏసీ బస్సులుగా మార్చేటప్పుడు నాణ్యత లేని మెటీరియల్ వాడుతున్నారని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

అడ్డూ అదుపులేని వేగం

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల వేగానికి అడ్డూఅదుపూ లేకుండాపోతోంది. గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతున్నాయి. తిరుపతి నుంచి విజయవాడకు ఆరేడు గంటల్లో దూసుకుపోతున్నాయి. వేగాన్ని నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు నెలవారీ మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా వీరు తమ అధికారాలను వినియోగిస్తే వేగంలాంటి అంశాలకు బ్రేకులు పడతాయి.

ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం

జిల్లాలో ప్రైవేట్ బస్‌లను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. ప్రయాణికుల పరిమితి దాటినా, ఫిట్‌నెస్, ఎఫ్‌సీ, ఇన్సూరెన్సులు లేకుండా రోడ్లపైకి వచ్చినా అపరాధం విధిస్తున్నాం. ఇప్పటివరకు కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై 565 కేసులు నమోదు చేశాం. దాదాపు రూ.42.95 లక్షలు జరిమానా కింద వసూలు చేశాం.

- మురళీమోహన్, జిల్లా రవాణా శాఖ అధికారి

తిరుమలలో ముసురు


ఆలయం ముందు కురుస్తున్న జల్లులు

తిరుమల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం తిరుమలలో వేకువజాము నుంచే ముసురు వాతావరణం కనిపించింది. చిరుజల్లులే కావడంతో భక్తులకు పెద్దగా అసౌకర్యం కలుగలేదు. ఉండిఉండీ దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేస్తోంది. సాయంత్రానికి చలి తీవ్రత పెరిగింది. తుఫాన్ ప్రకటనల నేపథ్యంలో రద్దీ కూడా తక్కువగానే ఉంది. ఆలయ పరిసరాల్లో భక్తులు పలుచగా కనిపించారు. పదిరోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరుమల ఘాట్‌రోడ్లపై ఫారెస్ట్, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. తరుచూ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలపై దృష్టి పెట్టారు. అనుకోకుండా కొండరాళ్లు, చెట్లు విరిగిపడితే వెంటనే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఘాట్‌రోడ్లలో నెమ్మదిగా ప్రయాణించాలని, చెట్ల కింద ఉండకూడదంటూ ప్రకటనలు చేశారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

- 19 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం/నారాయణవనం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరు స్మగ్లర్లను అరెస్టుచేసి 19 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఏఆర్ఎస్ఐ ఈశ్వరరెడ్డి బృందం ఆదివారం కైలాసకోన నుంచి కూంబింగ్ చేపట్టారు. సోమవారం నారాయణవనం సమీపంలోని సింగారకోన రోడ్డు కన్నికలమ్మ ఆలయం సమీపానికి చేరుకోగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద రీతిలో టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటపడ్డారు. టాస్క్‌ఫోర్సు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకుని విచారించగా పరిసర ప్రాంతాల్లో ఎర్రచందనం దుంగలు దాచి ఉంచినట్లు చెప్పారు. వారు దాచిన 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని పట్టుబడిన వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని స్థానికులుగా గుర్తించారు. దుంగలతో పాటు స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కఠారి దంపతుల హత్య కేసు తీర్పు వాయిదా

చిత్తూరు లీగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రథమ మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్య కేసు తీర్పును ఈనెల 30వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసు విచారణ పూర్తయిన తర్వాత ఈనెల 24న చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేశ్‌లను నిందితులుగా తేల్చారు. సోమవారం తుదితీర్పు ఉంటుందని న్యాయమూర్తి ప్రకటించిన నేపథ్యంలో ఆ ఐదుగురిని పోలీసులు 9వ అదనపు జిల్లా కోర్టులో హాజరుపరిచారు. చింటూ తరపున న్యాయవాది విజయ చంద్రారెడ్డి పది నిమిషాల పాటు తమ వాదనను వినిపించారు. అనంతరం ఐదుగురి వాంగ్మూలాలను న్యాయమూర్తి తీసుకున్నారు. ప్రభుత్వాస్పత్రి వైద్యులు, పోలీసులు వారి వాంగ్మూలాలపై నిజానిజాలు పరిశీలించి 30వ తేదీ మధ్యాహ్నం నివేదిక అందించాలని న్యాయమూర్తి శ్రీనివాసరావు ఆదేశించారు. అదే రోజు తీర్పు వెల్లడిస్తానని తెలిపారు.

యువజన పోటీలు వాయిదా

తిరుపతి అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వివేకానంద జయంతి సందర్భంగా మంగళవారం నిర్వహించతలపెట్టిన జిల్లా స్థాయి యువజన వారోత్సవ(సాంస్కృతిక) పోటీలను వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు సెట్విన్ సీఈవో పి.యశ్వంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ మొదటి వారంలో నిర్వహించేలా ఆలోచన చేస్తున్నామని, తేదీని తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. యువతీ యువకులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

జగదీష్‌కు డీపీటీవోగా పదోన్నతి

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న జగదీష్‌కు ప్రజారవాణాధికారి(ఆర్ఎం క్యాడర్)గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆయన ఇన్‌చార్జ్ డీపీటీవోగా అన్నమయ్య, విజయనగరం, చిత్తూరు జిల్లాల్లో పనిచేశారు. ప్రస్తుతం తిరుపతిలో పనిచేస్తుండగా ఇదే జిల్లాకు డీపీటీవోగా పోస్టింగ్ ఇచ్చారు. ఆయన్ను సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ, ఇతర అధికారులు, సిబ్బంది అభినందించారు.

సియోల్‌లో శ్రీసిటీ బృందం పర్యటన


కొరియా ప్రతినిధులతో శ్రీసిటీ బృందం

సత్యవేడు, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడులు, వ్యాపార విస్తరణలో భాగంగా శ్రీసిటీ మార్కెటింగ్ బృందం కొరియాలో పర్యటిస్తోంది. శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ నేతృత్వంలో సియోల్‌లోని భారత రాయబార కార్యాలయ డిప్యూటీ కమిషనర్ చీఫ్ నిషికాంత్ సింగ్, జపాన్ ఉన్నతాధికారులు కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతి, 31 దేశాలకు చెందిన 240కు పైగా పరిశ్రమలను ఆకర్షించడంలో శ్రీసిటీ పాత్రను వివరించారు. ఎల్జీ, సోలుమ్, హ్యుందాయ్, ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ (హెచ్‌డీసీ), ఎస్కే ఫ్యుకేర్, ఎల్జీ పాలిమర్స్ వంటి ప్రముఖ కొరియన్ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వారికి వివరించారు. అలాగే సియోల్‌లో జరిగిన కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ ఐటీ ప్రదర్శన (కేఈఎస్ 2025)ను సందర్శించారు. కొట్రా (కొరియా ట్రేడ్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ ఏజెన్సీ) అధికారులు, ఇతర వ్యాపార ప్రతినిధులతో వ్యూహాత్మక సమావేశాలు నిర్వహించి, పెట్టుబడి భాగస్వామ్య అవకాశాలను చర్చించారు. శ్రీసిటీ వేగవంతమైన పురోగతిని వివరించిన నిషికాంత్ సింగ్ భవిష్యత్ కొరియా పెట్టుబడులకు తన మద్దతు తెలిపారు. శ్రీసిటీ బృందం సియోల్ పర్యటన శ్రీసిటీ, కొరియన్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలపరుస్తుందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు.




నారద పుష్కరిణిలో ఏర్పాటు చేసిన దీపాలు, దీపాలు వెలిగిస్తున్న ఈవో దంపతులు

శ్రీకాళహస్తిలో లక్ష దీపోత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ నారద పుష్కరిణిలో కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. పుష్కరణి చుట్టూ క్రమపద్ధతితో నేతిదీపాలను ఆలయాధికారులు సిద్ధం చేశారు. పుష్కరిణి ప్రాంగణంలో స్వామి అమ్మవార్ల చిత్రపటానికి పూజలు చేసి హారతులు సమర్పించారు. అనంతరం ఈవో బాపిరెడ్డి దంపతులు నేతి దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు. కార్తీకమాసం తొలి సోమవారం నేపథ్యంలో ముక్కంటి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు


నిందితులను సెంట్రల్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల చొప్పున జైలు శిక్షతో పాటు రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన సుబ్రమణి సతీష్ కుమార్, తిరువణ్ణామలైకి చెందిన కుల్లయన్ వెంకటేష్ ఎర్రచందనం చెట్లను నరికేందుకు తిరుపతి అటవీశాఖ పరిధిలోని పెరుమాళ్లపల్లె, టీఎన్‌పాళెంలోని శేషాచల అడవిలోకి ప్రవేశించారు. వీరిని పట్టుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. వీరిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఇద్దరు స్మగ్లర్లను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ వాదనలు వినిపించారు. ఎర్రచందనం చెట్లను నరికేందుకు అక్రమంగా ప్రవేశించే వారికి.. ఈ తీర్పు ఓ హెచ్చరిక అవుతుందని టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

రెండు కిలలో గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిని తిరుపతి పోలీసులు సోమవారం అరెస్టుచేశారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి, ఒక స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. తిరుపతి కోలా వీధికి చెందిన షేక్ సందానీ, చిన్నం చెట్టి బద్రినాథ్, గిరిపురానికి చెందిన ధనుష్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరిలో షేక్ సందానీ కొద్దిరోజుల క్రితం వైజాగ్ వెళ్లి కిలో రూ.7500 చొప్పున రెండు కిలోల గంజాయి కొన్నాడు. రైలులో విజయవాడకు.. అక్కడ్నుంచి బస్సులో రేణిగుంటకు చేరుకున్నాడు. మిగతా ఇద్దరూ స్కూటర్‌లో అక్కడికి చేరుకుని.. గంజాయితో పాటు సందానీని తీసుకుని తిరుపతికి బయలుదేరారు. ఈ గంజాయిని చిన్న పొట్లాలు చేసి, పొట్లం రూ.200 నుంచి, 300కు అమ్మాలన్నది వీరి ఉద్దేశం. దీనిపై అందిన సమాచారంతో డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది రామానుజ సర్కిల్ వద్ద కాపుకాసి వారిని పట్టుకున్నారు.








అనుసంధానం చేసేందుకు వ్యాబ్‌కు తరలిస్తున్న సీఎంఎస్-03 ఉపగ్రహం - రాకెట్ మొదటి దశ - రాకెట్ రెండో దశ - రాకెట్ మూడో దశ


రెండో ప్రయోగ వేదికపై ఎల్వీఎం3-ఎం5 రాకెట్

మరో ప్రయోగానికి షార్ సిద్ధం

మరో ప్రయోగానికి షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సిద్ధమైంది. ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 4,400 కిలోల బరువైన సీఎంఎస్-03 (జీశాట్-7ఆర్) కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపేందుకు శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. వ్యాబ్‌లో రాకెట్ అనుసంధాన పనులు పూర్తి చేసి రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలించారు. సోమవారం లెవల్ 1, లెవల్ 2 తనిఖీలు చేసి పలు పరీక్షలు చేశారు. కాగా, రాకెట్‌ను దశలవారీగా అనుసంధానించిన ఫొటోలను ఇస్రో సోమవారం విడుదల చేసింది.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి


వ్యాబ్ నుంచి రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలిస్తున్న దృశ్యం

ఆలయాల్లో కార్తీక పూజలు



నాగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు శివనామస్మరణాలతో మార్మోగాయి. వర్షంలోనూ ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. నాగేశ్వరస్వామి ఆలయంలో శివుడికి అభిషేకం చేసి పుష్పాలతో అలంకరించారు. అదే విధంగా టీడీపీ కార్యాలయం వద్ద అభయ శంకురుడి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఆలయ చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, కమిటీ సభ్యులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

తడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నమాంబట్టులో ఉన్న కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆలయంలో కార్తీక మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గోపూజ నిర్వహించారు. విశిష్ఠ పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాలకు ఇండ్ల ప్రభాకర్, భాగ్యవతి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి సిమ్స్ వైద్యుడు మునస్వామి, గ్రామస్తులు వేనాటి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కండక్టరును దూషించిన హౌసింగ్ ఏఈ
పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

బాలాయపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళా కండక్టరును దూషించిన హౌసింగ్ ఏఈపై పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటగిరిలో గృహనిర్మాణ శాఖ ఏఈగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం సోమవారం గూడూరు వెళ్లే పల్లె వెలుగు బస్సు ఎక్కి కండక్టర్ సీట్‌లో కూర్చున్నారు. ప్రయాణికులకు టికెట్లు ఇవ్వడం పూర్తయ్యాక కండక్టర్ కస్తూరమ్మ తన సీటు వద్దకు వచ్చారు. ఏఈ సుబ్రహ్మణ్యంను మరో సీటులో కూర్చోవాలని కోరగా వినిపించుకోకుండా వివాదానికి దిగారు. ఈ క్రమంలో అసభ్యంగా దూషించారు. దీంతో బాలాయపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద బస్సు ఆపి ఏఈ సుబ్రహ్మణ్యంపై కండక్టర్ కస్తూరమ్మ ఫిర్యాదు చేశారు. బస్సులో ప్రయాణికులు కూడా సుబ్రహ్మణ్యం కండక్టరును దూషించారని చెప్పడంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ జార్ఖండ్ మహిళ మృతి

నాయుడుపేట టౌన్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజేష్‌బుయ్యాన్ రెండేళ్లుగా మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్నాడు. పది రోజుల క్రితం అతని భార్య బసంతీదేవి, ముగ్గురు పిల్లలు రాజేష్‌బుయ్యాన్‌తో పాటు రాజు పాళెంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 25న దంపతుల మధ్య చిన్నపాటి వివాదం ఏర్పడటంతో బసంతీదేవి ఇంట్లో ఉన్న టాబ్లెట్‌లను మింగేసింది. గమనించిన రాజేష్ బుయ్యాన్ నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బసంతీదేవి(30) సోమవారం మృతి చెందింది. రాజేష్‌బుయ్యాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అధ్వానంగా తీర ప్రాంతాల రోడ్లు



కర్లపూడి, ఉచ్చూరువారిపాళెం రోడ్ల దుస్థితి

కోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్రతీర ప్రాంతాల రోడ్లు అధ్వానం మారాయి. గూడలి నుంచి సముద్రతీరానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులుపడి చెరువును తలపిస్తోంది. కోట నుంచి కొక్కుపాడు, ఉచ్చూరువారిపాళెం, ఉత్తమనెల్లూరు, సిద్ధవరం వంతెన వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కోటపోలూరు రోడ్డులో కల్వర్టుకు గొయ్యి



సూళ్లూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కోటపోలూరు రోడ్డు భాగా దెబ్బతిని గోతులమంగా మారింది. సోమవారం కోటపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న కల్వర్టుకు పెద్ద గొయ్యి ఏర్పడి వాహనాలకు ఇబ్బందిగా మారింది. వెంటనే ఎంపీడీవో మురళీకృష్ణ స్పందించి గొయ్యి పడిన చోట చెట్టు కొమ్మను పాతి ప్రమాదాలు జరగకుండా వాహనదారులను అప్రమత్తం చేశారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు నాయుడుపేట క్రీడాకారులు



జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన దీపిక, బెనేల్

నాయుడుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని కోరమంగల్ స్టేడియంలో ఈనెల 31 నుంచి నవంబరు 2వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు నాయుడుపేట క్రీడాకారులు బి.దీపిక, ఎస్.బెనేల్ ఎంపికైనట్లు తైక్వాండో అసోషియేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.అఖీల్, కోచ్ ఉయ్యాల పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో అండర్-68 కేజీల బాలికల విభాగంలో బి.దీపిక, అండర్-68 కేజీల బాలుర విభాగంలో ఎస్.బెనేల్ ప్రతిభ కనపరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని తైక్వాండో అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.మనీషా, కోచ్‌లు భగత్, చంద్రమోహన్, వినోద్‌కుమార్, అష్రఫ్, విజయ్, ఆంజనేయులు అభినందించారు.

బాలింతలకు పౌష్టికాహారం అందజేత

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో బాలింతలకు సోమవారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఆర్‌వీ రావు, సుధాకర్, గోపీనాథ్‌రెడ్డి, వెంకయ్య, గురునాథం, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుడికి చేయూత

నాయుడుపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట లోతువాని గుంటకు చెందిన రిక్షా కార్మికుడు షేక్ మస్తాన్‌కు సోమవారం మౌనిక మదర్ వెల్ఫేర్ సంస్థ అధ్యక్షురాలు రత్నశ్రీ బియ్యం, నిత్యా వసర సరుకులను అందజేశారు. ఇటీవల ఆరోగ్యం సరిగా లేకపో వడంతో పాటు వర్షాల వల్ల జీవనోపాధి లేకపోవడం మస్తాన్‌కు రత్నశ్రీ చేయూత అందించారు. కార్యక్రమంలో సుధాకర్ నాయుడు, సాయినాయుడు, రేష్మా, భావన, అరుణ తదితరులు పాల్గొన్నారు.

తుఫానుతో నష్టం లేకుండా చూడండి

చిల్లకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఎటువంటి నష్టం జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి అరుణ్‌బాబు అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంను ఆయన పరిశీలించారు. తీరప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఎప్పటికప్పుడు తుఫాన్ గమనాన్ని తెలుసుకుంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్‌ఐ సురేష్‌బాబు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి అరుణ్‌బాబు

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

తడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తుఫాన్ ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ శాఖ డీఈ కస్తూరి ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, ప్రజలంతా ఇళ్లలోనే ఉండాలని గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో శేఖర్ నాయక్, ఎస్‌ఐ కొండపనాయుడు, ఎంఈవో మల్లికార్జునరావు, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్పెషల్ కలెక్టర్ సందీప్ రఘువంశీ సోమవారం సాయంత్రం తడ మండలం భీములవారిపాళెం పడవలరేవుకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులను ఆరా తీశారు. ఆయన వెంట సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, ఇతర అధికారులు ఉన్నారు.

సూళ్లూరుపేట: మొంథా తుఫాన్ ప్రభావంపై తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అధికారులు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పులికాట్ తీరప్రాంత గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పునరాస కేంద్రాలు ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ, పోలీసులు ముంపు ప్రాంతాలను పరిశీలించి అక్కడ ప్రజలతో మాట్లాడి అప్రమత్తం చేశారు. కాళంగి నది, నెర్రి కాలువ, పాముల కాలువను పరిశీలించారు. కాళంగిలో చేపలు పట్టేవారిని పంపించేశారు. పులికాట్‌లో మరో మూడు రోజుల పాటు జాలర్ల వేటకు వెళ్లొద్దని సూచించారు. కాగా, సూళ్లూరుపేటలో సోమవారం ఉదయం నుంచి తేలికపాటి జల్లులతో కూడిన వర్షం కురిసింది.

కోట: మొంథా తుఫాన్ తీరం దాటే సమయంలో గాలులతో పాటు భారీ వర్షం పడే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం అన్నిశాఖల అధికారులతో మొంథా తుఫాన్‌పై సమీక్ష నిర్వహించారు. మండలంలో 7 తీరప్రాంత గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించామన్నారు. ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి, నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచామన్నారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామన్నారు.



తడ మండలంలోని భీములవారిపాళెం పడవలరేవు వద్ద పరిస్థితి గురించి ఆర్డీవో కిరణ్మయితో మాట్లాడుతున్న స్పెషల్ కలెక్టర్ సందీప్ రఘువంశీ

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ప్రత్యేకాధికారి అరుణబాబు అన్నారు. సోమవారం నెల్లూరు నుంచి తిరుపతికి వెళ్తున్న ఆయన నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను పరిశీలించారు. అనంతరం సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లో తుఫాన్ ముందస్తు ఏర్పాట్ల గురించి ఆర్డీవో కిరణ్మయితో చర్చించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేస్తూ తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండలంలోని లోతట్టు ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. కాళంగి నదిపై తనియాలి వంతెనను, వెదురుపట్టు రోడ్డులోని పాలకాలువ వంతెన, పూలతోట వద్ద కన్నాకాలువపై ఉన్న వంతెనలను పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువైతే వరదలు వచ్చి రహదారుల్లో రాకపోకలు ఆగిపోయే అవకాశాలు ఉండటంతో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే సిబ్బందిని నియమించారు. అలాగే పులికాట్ తీరంలోని మీజూరు చెక్‌డ్యామ్ వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈ పర్యటనలో ఎంపీడీవో గోవర్ధన్, తహసీల్దారు శైలాకుమారి, ఎస్‌ఐ అజయ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని స్వర్ణముఖినది పరివాహక లోతట్టు ప్రాంతాలను అధికారులు, నాయకులు సోమవారం పరిశీలించారు. పాలచ్చూరు గ్రామంలో చెరువుకట్ట బలహీనంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి తహసీల్దార్ హరికృష్ణ, ఎస్‌ఐ నాగరాజుతో మాట్లాడి పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే ఎక్స్‌కవేటర్‌తో కలుజు, తూముల్లో పిచ్చి మొక్కలను తొలగించారు.



దొరవారిసత్రం మండలంలోని పూలతోట సమీపంలో కన్నాకాలువ వంతెనను పరిశీలిస్తున్న అధికారుల బృందం

నాయుడుపేట: మండలంలోని స్వర్ణముఖి నది కాజ్‌వే వద్ద వరద నీటి ప్రవాహాన్ని తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు సోమవారం పరిశీలించారు. అలాగే పండ్లూరు వద్ద మామిడికాలువ ప్రవాహాన్ని, మాబాక కాజ్‌వే ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఓజిలి: మొంథా తుఫాన్ నేపథ్యంలో మండలంలోని సిబ్బందిని అప్రమత్తం చేశామని తహసీల్దారు పద్మావతి చెప్పారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వరద ముంపునకు గురయ్యే గ్రద్దగుంట ఎస్టీ కాలనీ, నెమళ్ళపూడి కరకట్ట ప్రాంతవాసులకు సమీపంలోని పాఠశాలలో వసతి ఏర్పాటు చేశామన్నారు. ఎంఈవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆయా గ్రామాల వీఆర్వోలు ఏర్పాట్లు చేశారని తెలిపారు. అదే విధంగా వరద ప్రవాహం కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాలను గుర్తించి జాగ్రత్త చర్యలు తీసుకున్నామని చెప్పారు.

పార్టీలకు అతీతంగా సీఎం సహాయనిధి సాయం

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని పేదలందరికీ పార్టీలకు అతీతంగా సీఎం సహాయనిధి నుంచి సాయం అందజేస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 18 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.16.67 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు నియోజకవర్గంలో పలువురికి సీఎం సహాయనిధి నుంచి రూ.3 కోట్ల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ పరిధిలోని పేదలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే తన దృష్టికి తీసుకొస్తే సీఎం సహాయనిధి నుంచి సాయం అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నెల్లూరు జిల్లాలో గూడూరు గూడూరు నియోజకవర్గాన్ని కలిపేలా ప్రభుత్వానికి నివేదికను పంపాలని కలెక్టర్‌కు ఆదేశాలు అందాయన్నారు. త్వరలోనే ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, బిల్లు చెంచురామయ్య, రమణయ్య, పెంచలయ్య, వాటంబేడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

జలదిగ్బంధంలో తీరప్రాంత గ్రామాలు



బాలిరెడ్డిపాళెం వద్ద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి, సీఐ హుస్సేన్‌బాషా, ఎస్‌ఐలు నాగబాబు, పవన్

వాకాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో తూపిలిపాళెం సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది. అలలు 5 మీటర్ల మేర ఎగిసిపడుతుండడంతో తీరప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మాధవాపురం, పున్నమామితిప్ప, తానాకట్ట, శ్రీనివాసపురం, పంబలి, పులింజరిపాళెం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చినతోట, వైట్‌కుప్పం, నవాబుపేట, పూడిరాయదొరువు, పూడికుప్పం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్ మాధవాపురానికి బోట్‌లో వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. తూపిలిపాళెం ఎస్టీకాలనీలో తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ గీతాకుమారి, సీఐ హుస్సేన్‌బాషా, వాకాడు, కోట ఎస్‌ఐలు నాగబాబు, పవన్ బాలిరెడ్డిపాళెం వద్ద ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. స్వర్ణముఖినది వంతెనపై రాకపోకలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూలిన పక్కా గృహం

చిట్టమూరు, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యాకసిరి పాటిమిట్ట గిరిజన కాలనీకి చెందిన చెంబేటి సుధాకర్ ఇల్లు సోమవారం కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి బైట ఉండడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న సామగ్రి, నిత్యావసర సరుకులు పాడయ్యాయని బాధితుడు వాపోయాడు. వీఆర్వో సునైన, పంచాయతీ కార్యదర్శి రమేష్ కూలిన ఇంటిని పరిశీలించి తహసీల్దార్ నరేష్‌కు నివేదిక అందజేశారు.

పోలీస్ సిబ్బందికి రెయిన్ కోట్ల అందజేత

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ విధులు నిర్వహించనున్న పోలీస్ సిబ్బందికి డీఎస్పీ గీతాకుమారి రెయిన్ కోట్‌లను సోమవారం అందజేశారు.

యూరియా పంపిణీ

పెళ్లకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకూరు రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, వీఏఏ శ్రీనాథ్, టీడీపీ నాయకులు కలపాటి సురేష్, సుబ్బయ్య, వెంకటయ్య, ఉదయ్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలి

తడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ చంద్రశేఖర్ ఆదేశించారు. తడ సబ్ స్టేషన్‌ను పరిశీలించిన ఆయన తుఫాన్ వల్ల ఏర్పడే అవరోధాలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనవెంట ఏడీఈ శేఖర్, ఏఈ మురళి ఉన్నారు.

తీరప్రాంత గ్రామాలకు రేషన్ బియ్యం తరలింపునకు చర్యలు



ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి, ఆర్‌ఐ రాజగోపాల్

సూళ్లూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో తీరప్రాంత గ్రామాలు, ముంపు ప్రాంతాలకు రేషన్ బియ్యాన్ని తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి అధికారులతో కలిసి ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను తనిఖీ చేశారు. వర్షాలు పడుతుండడంతో ముందుగానే రేషన్ బియ్యం తరలించాలని డీటీ తులసిని ఆదేశించారు.

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పట్టణంలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం జల్లులు పడ్డాయి. తరువాత కొంతసేపు తెరపిచ్చినా మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా జల్లులు కురిశాయి.

పుత్తూరు వార్తలు

మొంథా తుఫానుపై అప్రమత్తం
మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను పరిణామాలను మున్సిపాలిటీ పరిధిలో సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పోలీస్, ఫైర్, మున్సిపల్ శాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. సోమవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం లోతట్టు ప్రాంతాలలో పర్యటించారు. ఉప్పు కాలువ పరిసరాల్లో పోలీస్ సిబ్బందితో పహారా ఏర్పాటు చేశారు. పిల్లారిపట్టు - నేసనూరు బ్రిడ్జి వద్ద, భవానీనగర్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. పట్టణంలోని అండర్ పాస్‌లలో నీరు నిల్వ కాకుండా మోటార్లను ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్ ఎక్స్‌కవేటర్‌తో పాటు రెండు యంత్రాలను అందుబాటులో ఉంచారు. ఈదురు గాలులకు పడే చెట్ల తొలగింపునకు ఎలక్ట్రిక్ రంపాలు అందుబాటులో ఉంచుకున్నట్లు కమిషనర్ తెలిపారు. పట్టణంలో శిథిలావస్థలో ఉన్న 16 ఇళ్లలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. కంట్రోల్ రూం నెం.7075067503, 7989995876లు ప్రజలకు నిరంతరంగా అందుబాటులో ఉంటాయని కమిషనర్ తెలిపారు.

ఎప్పటికప్పుడు...

వడమాలపేట (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జరీనా, ఎంపీడీవో శేషగిరిరావు చెప్పారు. సోమవారం వివిధ శాఖల మండలస్థాయి అధికారులతో తుఫాన్‌పై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు కలిగినా జిల్లా అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు.

హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ మృతి

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పోలీస్‌స్టేషన్‌కు అటాచ్‌మెంట్‌పై వచ్చిన హెడ్ కానిస్టేబుల్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. తిరుపతి వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా అనారోగ్యం కారణంగా పుత్తూరు స్టేషన్‌కు అటాచ్‌మెంట్‌పై వచ్చారు. పోలీస్ శాఖ నుంచి రూ.లక్షను ఎస్‌ఐ ఓబయ్య స్థానిక ఆరేటమ్మ కాలనీలోని కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీస్ లాంఛనాలతో హెడ్‌కానిస్టేబుల్ అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు సీఐ శేఖర్ రెడ్డి, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ శంకర్ రెడ్డి, శేఖర్ తదితరులు ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. కాగా ప్రకాష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు



పుత్తూరు టౌన్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు శివాలయాల్లో కార్తీక నెల మొదటి సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో వేకువ జామున శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టుపీతాంబరాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించారు. మహిళలు నేతి దీపాలు వెలిగించి దీప దర్శనం చేసుకు న్నారు.



వడమాలపేట (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పలు శివాలయాల్లో కార్తీక నెల మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని భవానీశంకర ఆలయంలో వేకువజామున మహాలింగానికి పంచామృత అభిషేకం నిర్వహించారు. మండల పరిధిలోని సదాశివకోనలో పలు ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు జాలువారే జలపాతంలో కార్తీక స్నానాలు చేసి తడిబట్టలతో సదాశివుడిని దర్శించుకున్నారు. అప్పలాయగుంట చంద్రమౌళీశ్వర స్వామి, ఓబీఆర్ కండ్రిగ వద్ద ఉమామహేశ్వర స్వామి, వడమాలలోని పరమేశ్వరుడి ఆలయాల్లో మహాశివుడి లింగానికి అభిషేకం నిర్వహించారు. మహిళలు ఆలయాల వద్ద నేతి దీపాలు వెలిగించారు.

జన సైనికుల్లో సయోధ్యకు శ్రీకారం
మంగళగిరిలో నేడు, రేపు ప్రత్యేక సమావేశాలు
విభేదాలకు కారణాలను తెలుసుకోనున్న శివశంకర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో ఉమ్మడి నెల్లూరు జిల్లా నాయకుల మధ్య సయోధ్య కుదిరించేందుకు ఏపీ ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్ శ్రీకారం చుట్టారు. జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు మంగళ, బుధవారాల్లో జిల్లా నాయకులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఇటీవల జనసేన నాయకుల మధ్య వర్గ విభేదాలు తారస్థాయికి చేరడంతో ఆగ్రహించిన పవన్ ఇరు వర్గాలను మంగళగిరి పార్టీ కార్యాలయానికి పిలిపించి క్లాస్ తీసుకున్నారు. ఈ క్రమంలో జిల్లాలో పార్టీని గాడిలో పెట్టేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఏపీ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌కు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని జనసేన పార్టీలో ఏం జరుగుతుందో తెలుసుకొని విభేదాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు తమ్మిరెడ్డి శివశంకర్ మంగళగిరిలోని తన కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం కానున్నారు.

కైలాస కోనలో పర్యాటకుల సందడి



నారాయణవనం, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాస కోనలో మొంథా తుఫాన్ హెచ్చరికలను భక్తులు పట్టించు కోలేదు. మొంథా తుఫాన్ నేపథ్యంలో కైలాసనాథ కోనకు 3 రోజుల పాటు పర్యాటకులకు, భక్తులకు ప్రవేశం నిషేధిస్తున్నట్టు తహసీల్దార్ రోజారాణి ఆదేశాలు జారీ చేశారు. అయితే కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు ఇవేమీ పట్టించుకోలేదు. వేకువ జామునే పెద్ద ఎత్తున కోనకు విచ్చేశారు. జలపాతంలో స్నానాలు ఆచరించి, కైలాస నాథుడికి పూజలు నిర్వహించారు. పలువురు దీపాలు వెలిగించారు. సుమారు 3 గంటల తర్వాత స్థానిక అధికారులు స్పందించి భక్తులను అక్కడి నుంచి పంపేశారు.

సమన్వయంతో తుఫాన్‌ను ఎదుర్కొందాం



అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

వరదయ్యపాళెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని శాఖల అధికారులందరు సమన్వయంతో పనిచేసి మొంథా తుఫాన్ ఇబ్బందులను అధిగమిద్దామని తహసీల్దార్ సుధీర్ రెడ్డి చెప్పారు. సోమవారం కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో తుఫాన్ ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తుఫాన్ ప్రభావంతో రాకపోకలకు అంతరాయం కలిగే ప్రాంతాలు, ముంపునకు గురయ్యే గ్రామాల్లో తీసుకోవాల్సి చర్యలను వివరించారు. గోవర్ధనపురం, సీఎల్ఎన్ పల్లె, కడూరు క్రాస్, పెద్ద పాండూరుల్లో రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మీ, ఏవో ప్రసాద్, ఎంఈవో సరస్వతి, ఏవో గౌరి తదితరులు పాల్గొన్నారు.

మోదుగులపాళెం వంతెన పరిశీలన



ఏర్పేడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదుగులపాళెం - కొత్తవీరాపురం మధ్య స్వర్ణముఖి నదిపై లోలెవల్ వంతెనను సోమవారం అధికారులు పరిశీలించారు. వర్షాలకు ఈ వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. తుఫాన్ నేపథ్యంలో తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఇతర రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

సదాశివకోన రిజర్వాయర్ ....



ఏర్పేడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు సమీపంలో ఉన్న సదాశివకోన రిజర్వాయర్ ఆయకట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారుల బృందం సూచించింది. సదాశివకోన రిజర్వాయర్‌ను సోమవారం తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, సీఐ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. భారీ వర్షాలు కురిస్తే సదాశివకోన కలుజు పారే అవకాశం ఉందని చెప్పారు. అధికారులతో పాటు ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, నాయకులు రాచేటి సుబ్రహ్మణ్యం, కేసినేని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అరణియార్‌లో చేపల వేట వద్దు



మత్స్యకారులకు సూచనలిస్తున్న అధికారులు

పిచ్చాటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో రోజంతా చిరుజల్లులతో ప్రజలు ఇంటి నుంచి వెలుపలికి రాలేదు. తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో మహ్మద్‌రఫి, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, ప్రసాద్ సిబ్బందితో పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. అరణియార్ కాలువ ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. అరణియార్ రిజర్వాయర్ కట్టకు వెళ్లే ప్రధాన మార్గంలోని గేట్లను మూసి వేశారు. ప్రాజెక్టులో చేపలవేట కోసం మత్స్యకారులు వెళ్లరాదని ఆదేశించారు.

కాలువ దాటలేక కొట్టాలమిట్ట గిరిజనుల ఇక్కట్లు



కేవీబీపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి కూత దూరంలో ఉన్న కొట్టాలమిట్ట గిరిజనకాలనీకి వెళ్లే దారిలో కళత్తూరు కాలువ ప్రవహిస్తుండటంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం కర్రలతో వంతెన నిర్మించాలని పలుమారు అధికారులను కోరినా పట్టించుకోలేదని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ కాలువపై రోడ్డు నిమిత్తం రూ.1.90లక్షలు మంజూరయ్యాయి. అయితే పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేపట్టాల్సి ఉంది.

శీల నిర్మాణంతోనే సమాజ రక్షణ

ఏర్పేడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో శీల నిర్మాణం ద్వారా సమాజాన్ని తల్లిదండ్రులు రక్షించాలని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఏర్పేడు ఎస్‌వీఎస్‌లో 'పిల్లల శీల నిర్మాణంలో తల్లుల పాత్ర'పై ప్రసంగించారు. సమాజంలో నైతిక విలువలు క్షీణించడం వల్ల అవినీతి, అక్రమాలు, లంచగొండితనం, అసాంఘిక కార్యాకలాపాలు పెరిగిపోతున్నాయన్నారు. కొన్ని సామాజిక వ్యవస్థల్లో పలువురు అక్రమాలకు పాల్పడుతున్నారని, వారంతా తల్లి కన్న పిల్లలే అన్నారు. బాల్యం నుంచే విలువలు నేర్పక పోవడమే ఇందుకు కారణమన్నారు. ఇప్పటి తల్లులు కథలు చెప్పడం, విలువలు నేర్పడం తగ్గిపోయిందన్నారు. దీంతో పిల్లలో సమగ్ర వ్యక్తిత్వ నిర్మాణం జరగడం లేదన్నారు. బాల్యం నుంచే శారీరక, మానసిక ఆరోగ్యం, సామాజిక స్పృహ పట్ల తమ పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఎస్‌వీఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, సహోద్యోగులు, యానిమేటర్లు, పల్లం, ఉడమలపాడు, అక్కుర్తి, చింతపాళెం గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కుమారుడి బారసాలకు ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, శ్రావ్య దంపతుల కుమారుడు శివన్ ఎర్రన్నాయుడు బారసాలకు సోమవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సుధీర్ హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో కాసేపు గడిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50,116

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి చంద్రగిరికి చెందిన మనోహర్ తన తల్లిదండ్రులు సరోజమ్మ, రామకృష్ణయ్య జ్ఞాపకార్థం రూ.50,116 విరాళంగా ఇచ్చారు. ఆలయ అధికారులు స్వీకరించి దాతకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



దర్శనం కోసం వెళుతున్న భక్తులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. స్థానిక భక్తులతో పాటు, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 31వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,403, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,058మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,050మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 731, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 214, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 179, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 68మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 27,499 అమ్ముడైనట్లు అధికారులు తెలిపారు.

●పట్టణం సహా మండలంలోని శైవ ఆలయాల్లో శంభో శంకరా అంటూ భక్తులు మొకరిల్లారు. ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. భిక్షాల గాలిగోపురం సమీపంలో మహిళలు ఉదయం నుంచి రాత్రి వరకు దీపాలు వెలిగించారు. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ముక్కంటిని దర్శించుకున్నారు. అలాగే పట్టణంలోని జెట్టిపాళెంలో కొలువై ఉన్న చక్రేశ్వ రస్వామి ఆలయం, పిట్టలవారి సంధులోని దుర్గామల్లీశ్వరాలయం, కుందేటివారివీధిలోని బృహదీశ్వరాలయం, పానగల్‌లో సర్వ సంపతేశ్వరాలయం, ప్రాజెక్టు వీధి శివాలయం, తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలిలోని వీరభద్రస్వామి ఆలయం, సింగమాలలోని శివాలయం, తొట్టంబేడు శివాలయం, పట్టణ శివారు స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న అర్ధనారీశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి మండలం వేడాంలో వెలసిన వెయ్యిలింగాలకోన, భైరవకోనలోని ఆలయాల్లో సోమవారం ఉదయం విశేష అభిషేకాలు పూజలు నిర్వహించారు.

కుర్ర కాలువ చెరువు కలుజు ఆక్రమణ తొలగింపు

రేణిగుంట అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): కుర్ర కాలువ చెరువు కలుజు ఆక్రమణను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా తొలగించారు. జీపాల్యం పంచాయతీ పరిధిలోని కుర్రకాలువ చెరువు కలుజు కాలువకు అడ్డంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు గోడకట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు కుర్ర కాలువ చెరువు నిండి పోయింది. దీంతో కలుజు నుంచి నీరు సమీపంలోని పద్మానగర్ కాలనీని ముంచెత్తింది. స్పందించిన తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, రెవెన్యూ ఇనెస్పెక్టర్ జయకృష్ణ ఆధ్వర్యంలో గోడను సోమవారం కూల్చివేశారు.

మల్లిమడుగు డ్యాం, మామండూరు వాటర్ ఫాల్స్‌కు సందర్శకుల నిషేధం

రేణిగుంట అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో మల్లిమడుగు డ్యాం, మామండూరు వాటర్ ఫాల్స్‌కు సందర్శకులను నిషేధించారు. అదేవిధంగా మల్లిమడుగు డ్యాంను డ్యామ్ సీఈ వరప్రసాద్, ఎస్ఈ రాధాకృష్ణమూర్తి, ఈఈ వెంకట రాజు పరిశీలించారు.

మొంథాను తేలికగా తీసుకోకండి

రేణిగుంట అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను తేలిగ్గా తీసుకోవద్దని మండల అధికారులకు ఎంపీడీవో రవిచంద్ర ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎక్కడ ఇబ్బంది ఉత్పన్నమైనా వెంటనే ఉన్నత అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. పీఆర్ ఏఈ, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాలకు కోతకు గురైన చిన్నాయగుంట రోడ్డుకు అదే గ్రామానికి చెందిన రైతు పురందర్‌నాయుడు తన సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చిన్నాయగుంట రోడ్డు కోతకు గురై రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందిపడ్డారు. స్పందించిన పురందర్‌నాయుడు తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టగా, వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

రెండు గేదెల మృతి



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు పల్లమాల గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాడి రైతు గోపాల్‌రెడ్డి గేదెలు సోమవారం మేతకు కేటీ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లి పోయింది. కాగా మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతు తెలిపారు.

తూతూమంత్రంగా మండల మీట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఏర్పేడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులుయాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేవలం పది మంది సర్పంచులు, ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. శాఖల వారీగా మండలంలో చేపట్టిన పనులకు సంబంధించి చర్చించారు. గ్రామస్థాయిలో రైతులకు వ్యవసాయశాఖ తగిన సమాచారం అందించడం లేదని ఏర్పేడు సర్పంచ్ శివయ్య ఏవో సాగరికను నిలదీశారు. ఏర్పేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని ఎంపీడీవో సౌభాగ్యం దృష్టికి తీసుకెళ్లాడు. తుఫాన్ ప్రభావంతో ఎక్కడైనా విపత్తులు సంభవిస్తే ప్రజాప్రతినిధులు కార్యదర్శులు, వీఆర్వోల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో సౌభాగ్యం సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జనార్దన్, ఏర్పేడు సింగిల్‌విండో చైర్మన్ కె.మహేష్‌రెడ్డి, ఎంఈవో ప్రేమలత, సీడీపీవో కృష్ణవేణి, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, ఈవోపీఆర్డీ రమణకుమార్ సహా పంచాయతీ కార్యదర్శులందరూ హాజరయ్యారు.

గుడిమల్లం ఆలయంలో కార్తీక మాస పూజలు



ఏర్పేడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): త్రిమూర్తుల ఆలయంగా పేరుగాంచిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఆలయ ప్రాంగణంలో నేతిదీపాలు వెలిగించారు. గోమాతకు పూజలు చేశారు. ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ గిరినాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, కర్పూర హారతులు నిర్వహించారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించి గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా నగరోత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి నగరోత్సవం వైభవంగా జరిగింది. కార్తీకమాసం సోమవారాన్ని పుర్కరించుకొని రాత్రి ఊరేగింపు జరిగింది. స్కందషష్టిని పు రస్కరించుకుని చెంగల్రాయస్వామిని కూడా ఊరేగించారు. ముందుగా స్వామిఅమ్మవార్ల, చెంగల్రాయ స్వామి ఉత్సవ మూర్తులను అ లంకారమండపంలో విశేషంగా అలంకరిం చారు. ధూప, దీప, నైవేద్యాల సమర్పణ అనంతరం చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు.

సింగిరికోనలో ఆకతాయిల వేధింపులు

ఫిర్యాదు చేసిన భాదితులు

నారాయణవనం, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగిరికోనలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయ దర్శనానికి వెళ్లిన తనను కొందరు ఆకతాయులు వేధించినట్టు బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నారాయణవనం గాండ్లవీధికి చెందిన నీరజ తన స్నేహితులు, బంధువులతో సింగిరికోన కొలనలో మునుగుతుండగా, సూర్య అనే అతను మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో నీరజ తమ్ముడు రాఘవ ప్రశ్నించగా అతనిపై సూర్య, అతని స్నేహితులు 10 మంది కలిసి దాడికి పాల్పడ్డారు. సోమవారం నీరజతో పాటు స్థానికుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ముక్కంటి ధర్మకర్తలమండలి సభ్యులకు సన్మానం



శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి సభ్యురాలిగా నియమితులైన చీరాల నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు రజనీని శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ డిల్లీబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన గాదిపాకుల కిరణ్‌ను సోమవారం ముస్లిం మైనార్టీలు సత్కరించారు. షాకీర్ అలీ, ఖాదర్‌బాషా, షఫీ, ఖలీల్, ఫ్రూట్ మీర్జా, షేక్ జహీర్, మస్తాన్, రఫి తదితరులు పాల్గొన్నారు.



నిండిన చెరువులు



మొరవపోతున్న పల్లమాల చెరువు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు చెరువులు కలుజులు పారుతున్నాయి. పల్లమాల, కారణి, చిన్నపాలేడు, కుక్కంబాకం, వేణుగోపాలపురం, కనమనంబేడు, కాంపాళెం, నీర్పాకోట చెరువులు నిండు కుండను తలపిస్తున్నాయి. మొంథా తుపాన్‌తో వర్షాలు కురిస్తే కట్ట తెగే ప్రమాదం ఉంది. పీవీకండ్రిగలో ప్రధాన రహదారి లోతట్టు కావడంతో వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఆ దారిలోనే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. మండలవ్యాప్తంగా సోమవారం మోస్తరు వర్షం కురిసింది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రమాద స్థాయిలో ఉన్న చెరువుల సమీప గ్రామాల ప్రజలను తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బందితో అప్రమత్తం చేశారు.

ముక్కంటి దర్శనానికి క్రికెటర్ ధోనికి ఆహ్వానం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో టీం ఇండియా క్రికెట్ మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనిని మంగళవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మహిమను వివరించారు. స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆహ్వానించారు.

పల్లికొండేశ్వర ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ ప్రమాణ స్వీకారం



పాలకమండలి చైర్మన్‌తో కృష్ణయ్య

పిచ్చాటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయం ట్రస్టు బోర్డు సభ్యుడిగా కృష్ణయ్య సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నెల 10న ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కృష్ణయ్య గైర్హాజరయ్యారు. దీంతో ట్రస్టు బోర్డులో పది మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనుండగా 9 మంది మాత్రమే ప్రమాణ స్వీకారం చేసి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా పద్మనాభరాజును ఎన్నుకున్నారు. ఈక్రమంలో కృష్ణయ్య ఎట్టకేలకు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ట్రస్టు బోర్డు చైర్మన్ పద్మనాభరాజు, ఆలయ ఈవో లత పాల్గొన్నారు.

తెలుగుయువత నాయకుడి మృతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం దిగువ కొణతనేరి హరిజనవాడకు చెందిన మాజీ సర్పంచ్ పులి గంగయ్య కుమారుడు, తెలుగు యువత నాయకుడు పులి వెంకటేష్ ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు అన్నారు. సోమవారం పులి వెంకటేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సుధీర్‌తో మాట్లాడి చంద్రన్న బీమా అందిస్తామని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. పార్టీ అండగా ఉంటుందన్నారు.

మురుగు తొలగించండి

ఏర్పేడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకతాగేలిలో వీధుల్లో ప్రవహి స్తున్న మురుగు తొలగింపునకు చర్యలు చేపటా లని గ్రామస్తులు కోరారు. దీంతో తహసీల్దారు భార్గవి, సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఇతర అధికారుల బృందం మంగళవారం ఇసుకతాగేలిలో పర్య టించారు. త్వరలో మురుగుకాలువ నిర్మించి సమస్య పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు. ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.